
RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్
సంపుటి : 3, సంచిక : 316 | ఆదివారం నవంబర్ 23, 2025 | పేజీలు : 6 వెల : రూ.3-00



పెన్నా నదిలో ఆరుగురు పశువుల కాపర్లు గల్లంతు

4లో..

- పల్లెల్లో ఎలక్షన్ హీట్
- ప్రధాన రాజకీయ పార్టీల సమాలోచనలు
- నెగ్గే దిశగా ఇప్పటి నుంచే అభ్యర్థుల వ్యూహాలు
- రిజర్వేషన్లపై కొనసాగుతున్న సందిగ్ధత
- వేచి చూసే ధోరణిలో కొందరు క్యాండిడేట్లు





# 'స్థానిక' సమాయత్తం!

**వేద న్యూస్, ఆసిఫాబాద్:**

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర సర్కారు ముందుకు సాగుతున్నది. ఈ నేపథ్యంలోనే పల్లెల్లో ఎలక్షన్ హీట్ మొదలైంది. రిజర్వేషన్ల అమలుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జీవో నం.46 విడుదల చేసింది. 50 శాతం మించకుండా రొటేషన్ పద్ధతిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా రిజర్వేషన్ల అమలుపై మార్గదర్శకాలు వెల్లడించింది. ఎలక్షన్ కమిషన్(ఈసీ) సైతం ఎన్నికల నిర్వహణకు రెడీ అవుతోంది. తొలుత సర్పంచ్ ఎన్నికలు జరపాలని సర్కారు భావిస్తోంది. దీంతో ప్రధాన రాజకీయ పార్టీలు లోకల్ పోల్స్‌లో నెగ్గేలా సమాలోచనలు చేస్తున్నాయి. అయితే, రిజర్వేషన్ల ఖరారుపై ఇప్పటికీ కొందరు సందేహ పడుతున్నారు. రిజర్వేషన్ల ఖరారుపై కోర్టుల పరిధిలో ఏవైనా అంశాలు ఒంటాయా? రిజర్వేషన్లు ఎలా నిర్ధారిస్తారు? అనే అంశాలపై వేచి చూసే ధోరణిలో కొందరున్నారు. మరి కొందరు మాత్రం పార్టీలతో సంబంధం లేకుండా అందరి మద్దతుతో రాబోయే సర్పంచు ఎన్నికలలో ఎలా నెగ్గాలనే అంశంపై ఆలోచన చేస్తున్నారు. ఎన్నికలలో నెగ్గడమే లక్ష్యంగా అందరితో ఇప్పటి నుంచే కలిసే ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలుస్తున్నది.

**– బీసీ రిజర్వేషన్లపై ఉత్కంఠ**

రాష్ట్ర సర్కారు నిర్వహించే సర్పంచ్ ఎన్నికలలో పార్టీ పరంగా మాత్రమే రిజర్వేషన్ల అమలు ఎలా సాధ్యమని పలువురు ప్రశ్నిస్తున్నారు. బీసీ రిజర్వేషన్లు ఇచ్చిన తర్వాతనే ఎలక్షన్స్ నిర్వహించాలని కొన్ని సంఘాలు డిమాండ్ చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ఎలక్షన్స్ సందర్భంగా ఇచ్చిన హామీ 42 శాతం బీసీ రిజర్వేషన్లపై చిత్తశుద్ధితో కృషి చేయాలని అంటున్నారు. కాగా, ఇప్పుడున్న పరిస్థితులు, కోర్టు మార్గదర్శకాల నేపథ్యంలో జూబ్లీ హిల్స్ గెలుపు ఊపుతో సర్పంచ్ ఎన్ని కలు వీలైనంత త్వరగా జరిగేలా ప్రభుత్వం మొగ్గు చూపుతున్నట్టు స్పష్టమౌతోంది. ఈ నెల 25న రాష్ట్ర కేబినెట్ భేటీలో ఎన్నికలపై స్పష్టత రావచ్చని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.




## బీసీ రిజర్వేషన్ లేకుండా ఎన్నికలు నిర్వహించవద్దు

**బీసీ జేఏసీ ఆసిఫాబాద్ జిల్లా చైర్మన్ రూపునార్ రమేష్**



స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించకుండా తెలం గాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్ని కలు నిర్వహించడకూడదు. బీసీ రిజర్వేషన్ కల్పించిన తరు వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిం చాలి. బీసీలకు రిజర్వే షన్లు కల్పిస్తా మని గొప్పలు చెప్పిన కాంగ్రెస్ ప్రభు త్వం.. ఇప్పుడు పార్టీ పరంగా రిజర్వేషన్లు ఇచ్చి ఎన్నికలు నిర్వహి స్తామని ప్రచారం చేయడం సరికాదు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ.. రెండు కూడా బీసీలను మోసం చేస్తున్నాయి. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే సహించం. బీసీల వాటా కోసం ఎంతకైనా కొట్లాడటానికి న్యాయ పోరాటానికి సిద్ధంగా ఉన్నాము.

## ఎన్నికల్లో యువతకు అవకాశాలు కల్పించాలి

**– ఆవిడపు ప్రణయ్, బీసీ యువజన సంఘం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు**



తెలంగాణ రాష్ట్రంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ యువతకు అవకా శాలు కల్పించాలి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలపై సవతి ప్రేమ చూపిస్తున్నాయి. జనాభా ప్రతిపాదికన బీసీలకు న్యాయబ ద్ధంగా 42 శాతం రిజర్వేషన్లు కల్పించాకే ఎన్నికలు నిర్వహించాలి. బీజేపీ ఎంపీలు బీసీ రిజర్వే షన్‌లపై పార్లమెంట్‌లో ప్రస్తావిం చి బీసీ రిజర్వేషన్లకి చట్టబద్ధత కల్పించే విధంగా కృషి చేయాలి.. లేదంటే బీసీలంతా ఏకమై స్థానిక సంస్థల ఎన్నికలు బహిష్కరించడంతో పాటు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు తగిన బుద్ధి చెబుతాము.

## రాష్ట్రపతికి విమానాశ్రయంలో వీడ్కోలు

**వేద న్యూస్, హైదరాబాద్ :**



హైదరాబాదు పర్యటనను పూర్తిచేసుకున్న భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు బేగంపేట విమానాశ్రయంలో అధికారికంగా వీడ్కోలు పలికారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మంత్రి పొన్నం ప్రభాకర్ మరియు నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి కలిసి రాష్ట్రపతికి అభివాదం చేశారు. రాష్ట్రపతి పర్యటన సందర్భంగా ఆమె వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న సంగతి తెలిసిందే. రాష్ట్ర పరిపాలన, అభివృద్ధి, సామాజిక సంక్షేమ రంగాల్లో జరుగుతున్న కార్యక్రమాలపై ఆమెకు అధికారులు వివరాలు అందించారు. పర్యటన మొత్తం ప్రశాంతంగా, ప్రభావవంతంగా సాగిందని ప్రభుత్వం పేర్కొంది. విమానాశ్రయంలో జరిగిన వీడ్కోలు కార్యక్రమంలో రాష్ట్రపతికి పరిపాలన తరఫున ప్రత్యేక ఆతిథ్యం కల్పించారు. పుష్పగుచ్ఛాలు అర్పించి, రాష్ట్ర సంప్రదాయాలకు అనుగుణంగా స్వాగత–వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రపతి పర్యటనకు రాష్ట్ర ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్రపతి తిరుగు ప్రయాణానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. భద్రతా బందోబస్తు విభాగం కూడా భారీగా మోహరించి మొత్తం ప్రక్రియను సమన్వయం చేసింది. రాష్ట్రపతి పర్యటన రాష్ట్రానికి మరింత ప్రోత్సాహం నింపిందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

# 'మావో'ల లొంగుబాటు

**- డీజీపీ ఎదుట హాజరైన 37 మంది.. - వారిలో ముగ్గురు రాష్ట్ర కమిటీ సభ్యులు - 9 మంది 'ఏరియా' మెంబర్స్: శివధర్‌రెడ్డి**

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి :**



అజ్ఞాతంలో ఉన్న 37 మంది మావోయిస్టులు లొంగిపోయారని తెలం గాణ డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. లొంగిపోయిన మావోయిస్టులను మీడియా ఎదుట శనివారం ఆయన ప్రవేశపెట్టారు. వారిలో ముగ్గురు రాష్ట్ర కమిటీ సభ్యులు ఉన్నారు. సదరు మావోయిస్టులంతా ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారేనని డీజీపీ వెల్లడించారు. ఖమ్మం డివిజనల్ కమిటీకి చెందిన వారు 9 మంది, దక్షిణ బస్తర్ కమిటీకి చెందిన వారు 22 మంది ఉన్నట్లు వివరించారు. గడిచిన 11 నెలల్లో 465 మంది మావోయిస్టులు రాష్ట్ర ప్రభుత్వం ఎదుట లొంగిపోయారని తెలిపారు

**– 2 ఏకే 47లు స్వాధీనం**

తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు కొయ్యల సాంబయ్య అలియాస్ ఆజాద్, రాష్ట్ర కమిటీ సభ్యుడు నారాయణ అలియాస్ రమేశ్, రాష్ట్ర కమిటీ మరో సభ్యుడు సోమ్‌దా అలియాస్ ఎర్ర కూడా లొంగిపోయారని వెల్లడించారు. మిగతా వారిలో ముగ్గురు డివిజనల్ కమిటీ సభ్యులు, 9 మంది ఏరియా కమిటీ సభ్యులున్నట్లు డీజీపీ వెల్లడించారు. వారి నుంచి రెండు ఏకే 47లు, 4 ఎస్ఎల్ఆర్‌లు, 303 తుపాకులు, 343 తూటాలు అప్పగించారని చెప్పారు. లొంగిపోయిన వారంతా తమ ఆయుధాలు కూడా అప్పగించారని అన్నారు. పార్టీ పరమైన విభేదాలు, భద్రతాపరమైన సమస్యలు, అనారోగ్య కారణాల వల్ల మావోయిస్టులు లొంగిపోయినట్లు తెలిపారు.

**– పునరావాస ప్యాకేజీ అందిస్తాం**

రాష్ట్రానికి చెందిన 59 మంది ఇంకా అజ్ఞాతంలో ఉన్నారని, వారిలో ఐదుగురు కేంద్ర కమిటీ సభ్యులు ఉన్నట్లు డీజీపీ తెలిపారు. 10 మంది రాష్ట్ర కమిటీ సభ్యులు ఉన్నారని, అజ్ఞాతంలో ఉన్నవారు ఎంత త్వరగా బయటకు వస్తే అంత మంచిదని డీజీపీ పేర్కొన్నారు. కొయ్యడ సాంబయ్య అలియాస్ ఆజాద్‌పై రూ.20 లక్షల రివార్డు, అప్పాస్ నారాయణపై రూ.20 లక్షల రివార్డు, లొంగిపోయిన అందరిపై కలిపి రూ.1.41 కోట్ల రివార్డు ఉందని, అది వారికే అందజేస్తామని డీజీపీ తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారికి ప్రభుత్వం ఇస్తున్న పునరావాస ప్యాకేజీ అందిస్తామని ఆయన పేర్కొన్నారు. సెంట్రల్ కమిటీలో తెలంగాణ వాళ్లు ఇంకా ఐదుగురు ఉన్నారని, మిగతా వాళ్లు కూడా త్వరగా లొంగిపోవాలని సూచిస్తున్నట్లు తెలిపారు. పోలీసుల ముందుకు వచ్చిన వారికి పూర్తి భద్రత ఉంటుందని, లొంగిపోయిన వారికి ఎలాంటి వేధింపులు ఉండవని హామీ ఇస్తున్నట్లు స్పష్టం చేశారు. మావోయిస్టు పార్టీ జాతీయ కార్యదర్శి ఎవరనేది తమకు ఇంకా తెలియదని కొయ్యడ సాంబయ్య అలియాస్ ఆజాద్ చెప్పారు. పార్టీకి చెప్పిన తర్వాతే లొంగిపోయామని, మిగతా వారు కూడా లొంగిపోవాలని విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు.



## కోటి మహిళలకు నాణ్యమైన చీరలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

**వేద న్యూస్, నల్గొండ :**




నల్గొండ జిల్లా కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పాల్గొని మహిళలకు చీరలను స్వయంగా అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు ఆత్మగౌరవాన్ని పెంపొందించే దిశగా ప్రభుత్వం చేపట్టిన ఈ మహత్తర కార్యక్రమం విస్తృత గుర్తింపు పొందుతోంది. తెలంగాణలో మొత్తం 1 కోటి 15 లక్షల కుటుంబాలు ఉన్నాయని, అందులో కోటి మంది మహిళలకు నాణ్యమైన చీరలను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ శనివారం నుంచి భారీ స్థాయిలో పంపిణీ ప్రారంభించిందని మంత్రి

మిగతా 3వ పేజీలో..

## ఢిల్లీలో గాలి నాణ్యత తీవ్రంగా క్షీణించడంతో ఆంక్షలు కఠినతరం

**వేద న్యూస్, హైదరాబాద్:**

దేశ రాజధాని ఢిల్లీలో గాలి నాణ్యత మరోసారి తీవ్ర స్థాయికి పడిపోయింది. శనివారం ఉదయం నగరంలోని మొత్తం గాలి నాణ్యత సూచిక (ఏక్యూఐ) 359గా నమోదై 'తీవ్రమైన' స్థాయిని చేరుకుంది. అనేక ప్రాంతాల్లో పొగమంచు దట్టంగా కమ్మేసి, కాలుష్య ప్రభావం మరింత పెరిగింది. దీంతో ప్రజల ఆరోగ్యంపై ప్రభావం పడుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఆనంద్ విహార్, వివేక్ విహార్, నోయిడా, బావన, జహాన్గీర్పురి వంటి ప్రాంతాల్లో ఏక్యూఐ 400 దాటిపోవడం గమనార్హం. నోయిడా సెక్టార్ 125లో గాలి నాణ్యత 434గా నమోదు కాగా, వివేక్ విహార్‌లో 423, బావనలో 419, రోహిణిలో

మిగతా 3వ పేజీలో..



వేద న్యూస్

ఆదివారం, నవంబర్ 23, 2025

# విద్యార్థులకు సన్మానం

**వేద న్యూస్, నల్లబెల్లి :**



నల్లబెల్లి ఉన్నత పాఠశాలలో చదువుతున్న హారిక, మహాలక్ష్మి, అక్షితలు ,ఇటీవల రాష్ట్ర స్థాయి రన్నింగ్, లాంగ్ జంప్ ,షాట్ పుట్ లో మొదటి మూడు స్థానాల ద్వారా రాష్ట్ర స్థాయికి ఎంపికైనందుకు పి ఆర్ టియుటిఎస్ నల్లబెల్లి మండల శాఖ ఆధ్వర్యంలో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంను ఉద్దేశించి నల్లబెల్లి పి ఆర్ టియుటిఎస్ అధ్యక్షులు ఉడుత రాజేందర్ మాట్లాడుతూ విద్యార్థులు ఇదే స్ఫూర్తితో రాష్ట్రస్థాయిలో రాణించి పాఠశాలకు, జన్మనిచ్చిన తల్లిదండ్రులకి మంచి పేరు తీసుకురావాలని, వారిని ప్రోత్సహించి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడానికి కృషిచేసిన ఫిజికల్ డైరెక్టర్ శంకరయ్య గారిని, ప్రధానోపాధ్యా యురాలు అంబి వసంతని ఉపాధ్యాయ బృందాన్ని ఈ సందర్భంగా అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండలంలోని పిఆర్ టియు టీఎస్ సంఘ రాష్ట్ర బాధ్యులు లడే రవీందర్, డి శ్రీధర్ బాబు, పురం బద్రీనాథ్ జిల్లా బాధ్యులు కే నాగరాజు , శనిగరం శ్రీనివాస్, సీనియర్ ఉపాధ్యాయులు ఏ పద్మజ ,బి ప్రమీల, కే భారతి, జి రజిత, బి మలల్ రావు, ఎన్ ప్రశాంత్ ,ఏ రాము, బలరాం నాయక్, లక్ష్మణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత కంటి వైద్య శిబిరం

**వేద న్యూస్, రుద్రూర్ :**



రుద్రూర్ మండల కేంద్రంలోని జెఎస్సీ కాలనీలో గల ఎస్సి కమ్యూనిటీ హాల్ లో ఎస్సి యూత్ వారి సహాకారముతో లయన్స్ క్లబ్ ఆఫ్ రుద్రూర్ ఆధ్వర్యంలో శనివారం లయన్స్ బోధన్ ఆసుపత్రి వారిచే ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కంటి నిపుణులు సతీష్, వారి సిబ్బందితో 68 మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 10 మంది రోగులకు మోతిబిందు ఆపరేషన్, ఇద్దరు రోగులకు కన్నుగుడ్డు మీద శుక్లపటలమునుండి కన్ను కొలిక వరకు పెరుగుతున్న మాంసపు ముద్ద కొరకు లయన్స్ కంటి ఆసుపత్రికి రెఫర్ చేయడం జరిగింది. అవసరమైన రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు లయన్స్ కెవి మోహన్, జిల్లా అధ్యక్షులు శ్యామ్ సుందర్ పహడే, కార్యదర్శి గుండూరు ప్రశాంత్ గౌడ్, కాలనీ సభ్యులు పోతరాజు లింగం, రాము, గంగాధర్, రవి, సురేష్, మంజరి భీమ్ కుమార్, కాసుల శ్రీనివాస్, కందూర్ రాజు క్యాంప్ ఇంచార్జ్ హన్మంత్ రావు తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలలో

# కురుమలు పోటీ చేయాలి

**వేద న్యూస్,కరీంనగర్:**



తెలంగాణలో అత్యధిక జనాభా గల కురుమలు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో అవకాశమున్న ప్రతి పార్టీలో, ప్రతి చోట వార్డ్ మెంబర్, సర్పంచ్ , యం పి టి సి, జడ్పిటిసి, మరియు యం పి పి వరకు అవకాశం ఉన్న ప్రతి గ్రామంలో ప్రతి మండలంలో పోటీకి సిద్ధం కావాలని కురుమ సంఘం జిల్లా అధ్యక్షులు కడారి అయ్యిలన్న కురుమ అన్నారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం ఉన్న కురుమలు అన్ని రంగాలలో అన్ని వర్గాలకు దీటుగా ముందుకు వెళున్నాం అన్నారు. గతంలో రాజకీయంగా, విద్యాపరంగా, ఉద్యోగాల్లో చాలా వెనుకబడి ఉన్న కురుమలు నేటి యువత విద్యా, ఉద్యోగ, రాజకీయ, ఆర్థిక రంగాలలో అన్ని వర్గాలకు ధీటుగా, సమానముగా ముందుకు వెళ్తున్నామన్నారు. ప్రభుత్వానికి మనం చెల్లిస్తున్న పన్నుల వాటాను ప్రభుత్వ నుండి కుల పరంగా కాని, వృత్తి పరంగా కాని సాధించుకోవాల్సిన అవసరం ఉన్నదన్నారు. దానికి పునాదే రాజకీయ పదవులన్నారు. మన కులవృత్తి అయిన గొర్రెల పెంపకం రోజురోజుకు సరియైన వసతులు లేక క్షీణిస్తున్నందున నేటి కురుమ యువత వృత్తికి దూరమవుచున్నందున అన్ని రంగాలలో ముందుకెళ్లాల్సిన అవసరం ఉన్నదన్నారు.

# మా ఊరు బడికి ఉపాధ్యాయుడు కావాలి

**వేద న్యూస్,ఇల్లంతకుంట:**



రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం బోటి మీది పల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందని గ్రామ మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్క ఉపాధ్యాయుడు 30 మంది విద్యార్థులకు బోధించాల్సి వస్తోందని, చదువు నాణ్యత దెబ్బతింటోందని పేర్కొన్నారు. మరో ఉపాధ్యాయుడిని తక్షణం నియమించాలంటూ స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు వారు వినతిపత్రం అందజేశారు. పాఠశాలకు కాంపౌండ్ వాల్ లేకపోవడంతో చెట్ల పొదలు పెరిగి పాములు కనిపించడం విద్యార్థుల భద్రతకు ప్రమాదమైందని మహిళలు తెలిపారు. చిన్న పిల్లలు భయంతో పాఠశాలకు రావడానికే వెనుకాడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కాంపౌండ్ వాల్‌ను అత్యవసరంగా నిర్మించాలని కోరారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ గుడిసె ఐలయ్య మహిళల సమస్యలను విని వెంటనే ఎంఈఓతో ఫోన్‌లో మాట్లాడి ఉపాధ్యాయుడు, కాంపౌండ్ వాల్ అంశాలపై చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. గ్రామంలో అంగన్వాడీ సెంటర్ లేకపోవడంతో చిన్నారులు కూడా ప్రభుత్వ పాఠశాలకే రావాల్సి వస్తోందని, అంగన్వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలంటూ గ్రామస్తులు డిమాండ్. చేశారు. ఈకార్యక్రమంలో మహిళలు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాల్లో మహిళలకు ప్రాధాన్యత

**వేద న్యూస్,ఇల్లంతకుంట:**




ఇందిరా మహిళా శక్తి చీరల ఉత్పత్తి పథకంతో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ కార్మికులకు ఉపాధి దొరుకుతుందని, మహిళల ఆత్మ గౌరవానికి తోడ్పడుతుందని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ఇల్లంతకుంట రైతు వేదికలో మహిళా ఉన్నతి. తెలంగాణ ప్రగతి కింద ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా మానకొం డూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం పథకాలు అమలు చేస్తుందని వివరించారు. ప్రతి ప్రభుత్వ పథకం అమలులో మహిళలకు ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ప్రజా ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఎస్ హెచ్ జీ ల నుంచి రుణాలు మంజూరు చేస్తుందని వెల్లడించారు. మహిళల ఆర్థిక ప్రగతికి కోట్లాది రూపాయల లోన్లు ప్రభుత్వం ఇస్తుందని తెలిపారు. జిల్లాలోని సిరిసిల్లలో ఇందిరా మహిళాశక్తి చీరలు తయారై రాష్ట్ర మంతా పంపిణీ చేయడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి మహిళకు ఇందిరా మహిళా శక్తి చీరలు పంపిణీ చేస్తామని స్పష్టం చేశారు. 32 జిల్లాల నుంచి ఎస్ హెచ్ జీ ల బాధ్యులు వచ్చి చీరల తయారీ విధానం, దశలు, రంగులు, నాణ్యత చూసి ఆనందం వ్యక్తం చేశారని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పన, మరమ్మత్తుల పనులు అమ్మ ఆదర్శ పాఠశాల కింద మహిళా సంఘాలకు అందించామని తెలిపారు. ఎస్ హెచ్ జీ ల్లో ప్రస్తుతం 18- 59 ఏండ్ల వారికి అవకాశం ఉందని, ప్రభుత్వం ఇప్పుడు 15-18 ఏండ్ల కిశోర బాలికలకు, 60 ఏండ్ల వయసు పైబడిన వారికి కూడా సంఘాలు ఏర్పాటు చేసే అవకాశం కల్పించిందని తెలిపారు. సంఘాల్లోని మహిళలకు రుణ బీమా, ప్రమాద బీమా అమలు చేస్తుందని, రూ. రెండు లక్షల వరకు రుణ బీమా, రూ. 10 లక్షల చొప్పున ప్రమాద బీమా మంజూరు చేసిందని వెల్లడించారు. జిల్లాలో కొత్తగా 5560 మంది ఎస్ హెచ్ జీల్లో చేరారని తెలిపారు. అంగన్వాడీ, ఆశా కార్యకర్తలతోపాటు ఇప్పుడు ఎస్ హెచ్ జీ సభ్యులకు యూనిఫాం చీరలు పంపిణీ చేస్తున్నామని ఎమ్మెల్యే, ఇంచార్జి కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ చైతన్య, వైస్ ఛైర్మన్ ప్రసాద్, డీఆర్డీఓ శేషాద్రి, మండల ప్రత్యేక అధికారి, డీసీఓ రామకృష్ణ, తహసీల్దార్ ఫరూక్, ఎంపీడీఓ శశికళ, ఏపీఎం, అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు ఆకాశమే హద్దుగా ముందుకు వెళ్లాలి



**వేద న్యూస్,బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి రైతు వేదికలో మహిళా ఉన్నతి తెలంగాణ ప్రగతి కింద ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, హాజరయ్యారు. అర్హులైన ప్రతి మహిళకు ఇందిరా మహిళా శక్తి చీరలు పంపిణీ చేస్తామని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, తెలిపా రు. అనంతరం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, మాట్లాడారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం పథకాలు అమలు చేస్తుందని వివరించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన రెండో రోజు నుంచే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు వారి పేరిట ఇస్తున్నామని వివరించారు. జిల్లాలోని సిరిసిల్లలో ఇందిరా మహిళాశక్తి చీరలు తయారై రాష్ట్ర మంతా పంపిణీ చేయడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి మహిళకు ఇందిరా మహిళా శక్తి చీరలు పంపిణీ చేస్తామని స్పష్టం చేశారు. 32 జిల్లాల నుంచి ఎస్ హెచ్ జీ ల బాధ్యులు వచ్చి చీరల తయారీ విధానం, దశలు, రంగులు, నాణ్యత చూసి ఆనందం వ్యక్తం చేశారని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, మరమ్మత్తుల పనులు అమ్మ ఆదర్శ, పాఠశాల కింద మహిళా సంఘాలకు అందించామని తెలిపారు. స్కూల్ యూనిఫాం వారితో కుట్టించామని పేర్కొన్నారు.సంఘాల్లోని మహిళలకు రుణ బీమా, ప్రమాద బీమా అమలు చేస్తుందని వెల్లడించారు. అంగన్వాడీ, ఆశా, కార్యకర్తల తోపాటు ఇప్పుడు ఎస్ హెచ్ జీ, సభ్యులకు యూనిఫాం చీరలు పంపిణీ చేస్తున్నామని ఎమ్మెల్యే, ఇంచార్జి కలెక్టర్, పేర్కొన్నారు. 200 యూనిట్ ల ఉచిత విద్యుత్, రూ. 500 లకే గ్యాస్ సిలిండర్, నూతన రేషన్ కార్డులు, ఇస్తున్నామనిసన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. ఎక్కడైతే మహిళలు సంతోషంగా ఉంటారో ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని సీఎం రేవంత్ రెడ్డి, ఆకాంక్ష అని పేర్కొన్నారు. ఆ దిశగా ప్రభుత్వ పథకాల్లో మహిళలకు ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని పేర్కొన్నారు. మహిళలు ఆకాశమే హద్దుగా ముందుకు వెళ్లాలని ఎమ్మెల్యే, ఇంచార్జి కలెక్టర్, ఆకాంక్షించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఎల్లేష్ యాదవ్, వైస్ ఛైర్మన్ నిమ్మ వినోద్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు సురేందర్ రెడ్డి, దుర్గారెడ్డి, డీఆర్డీఓ శేషాద్రి, తహసీల్దార్ నారాయణ రెడ్డి, ఎంపీడీఓ జయశీల, ఏపీఎం, అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత కంటి వైద్య శిబిరం

**వేద న్యూస్,రాజన్న సిరిసిల్ల:**



రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా పోలీస్ అధికారులకు ,సిబ్బంది వారి కుటుంబ సభ్యులకు శరత్ మాక్సీ విజన్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని జిల్లా ఎస్పీ ప్రారంభించి సిబ్బందితో పాటు వైద్య పరీక్షలు చేపించుకున్నరు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ... ప్రజలకు నిరంతరం సేవలందించే పోలీసుల ఆరోగ్యం అత్యంత ముఖ్యమని,పోలీసులు ఆరోగ్యంగా వున్నప్పుడే సమాజానికి మెరుగైన సేవలు అందించగలరని,ఆరోగ్య పరిరక్షణ కోసం పోలీసులు ఆరోగ్య పరీక్షలకై సమయాన్ని కేటాయించాలన్నారు. విధి నిర్వహణకై అంకితమైన పోలీసులతో పాటు వారి కుటుంబ సభ్యుల సంక్షేమన్ని.దృష్టిలో ఉంచుకొని ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఈశిబిరాలను పోలీసులు వారి కుటుంబ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈశిబిరంలో నేత్ర వైద్యుల బృందం పాల్గొని కంటి ఆరోగ్య పరిశీలన,దృష్టి సమస్యల నిర్ధారణ,అవసరమైన మందులు,సూచనలు అందించారు. రోజువారీ ఒత్తిడి, ఫీల్డ్ పనులు,రాత్రి పూట డ్యూటీ కారణంగా కంటి సమస్యలు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ఇలాంటి శిబిరాలు పోలీస్ సిబ్బందికి ఎంతో ఉపయుక్తమని,వైద్యులు పేర్కొన్నారు. ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేసిన శరత్ మ్యాక్సీ విజన్ యాజమాన్యంతో పాటు ఇందులో పాల్గొన్న వైద్య నిపుణులు, సిబ్బందికి జిల్లా ఎస్పీ కృతజ్ఞతలు తెలియజేసారు. ఈకార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, సి.ఐ లు మొగిలి,శ్రీనివాస్ ,రవి,నాగేశ్వరరావు, మధుకర్, ఆర్.ఐ లు మధుకర్, రమేష్,యాదగిరి, ఎస్.ఐ లు , పోలీస్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

# ఖబర్దార్ కవ్వంపల్లి తీరు మార్చుకో..!

– మాజీ సర్పంచ్ సిద్ధం శ్రీనివాస్

**వేద న్యూస్, ఇల్లంతకుంట:**



ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ గుండ్లపల్లి నుంచి పోత్తూరు వరకు రోడ్డు కాకుండా కేవలం గన్నేరువరం వరకే వేయిస్తానడం సిగ్గుచేటు గుండ్లపల్లి నుండి పోత్తూరు వరకు గతంలో మానకొండూరు ఎమ్మెల్యే మాజీ డాక్టర్ రసమయి బాలకిషన్, వినోద్ కుమార్ గతంలోనే డబల్ రోడ్డును 77 సి ఆర్ సాంక్షన్ చేశారు. అవి పనులు కూడా కొనసాగుతున్నాయి ఇప్పుడు మీరు వచ్చి రెండు సంవత్సరాలు అవుతుంది డబ్బులు లేవని గన్నేరువరం వారికి రోడ్డు వేస్తాము అనడంలో అంతర్గతం ఏంటో? అంటున్నారు అంటే మా ఇల్లంతకుంట పైన చొక్కారావు పల్లె పైన మీకు ప్రేమ లేదా? గన్నేరువారం వరకే వేయిస్తానడం సిగ్గుచేటు అని, నువ్వు గన్నేరువరం కే కాకుండా ఇల్లంతకుంట మండలానికి కూడా ఎమ్మెల్యేవనీ విషయం మర్చిపోవద్దని మాజీ సర్పంచ్ సిద్ధం శ్రీనివాస్ హితవు పలికారు. గుండ్లపల్లి నుంచి పోత్తూరు వరకు వెంటనే డబుల్ రోడ్డు వేయా లి. లేకపో ఇల్లంతుకుంట మండలంలో ఎక్కడకూ డా తిరుగ నీయమ ని హెచ్చరించారు. గుండ్ల పల్లి నుండి పోత్తూరు వరకు రోడ్డు కొనసాగకపోతే మళ్లీ పెద్ద ఎత్తున ధర్నా చేస్తాం ఖబర్దార్ కవ్వంపల్లి. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి అశ్విని శ్రీనివాస్, గుంటి ఆంజనేయులు, బండారి మహేష్, రోండ్ల కరుణాకర్ రెడ్డి, పట్నం మహేందర్, తోడేటి సతీష్, తిరుమల్, అభి, సతీష్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

# కోటి మహిళలకు నాణ్యమైన చీరలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

వివరించారు. ప్రతి మహిళకు గౌరవం, ఆత్మవిశ్వాసం కల్పించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని ఆయన తెలిపారు. ఈ చీరల పంపిణీ కార్యక్రమం మహిళల శక్తివంతత, సామాజిక స్థాయి పెరుగుదల దిశగా కీలక అడుగుగా నిలుస్తుందని కోమటిరెడ్డి పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు, స్వయం సహాయక బృందాల సభ్యులు, గృహిణులకు ఈ కార్యక్రమం ప్రత్యక్ష ప్రయోజనాలు అందిస్తుందని ఆయన తెలిపారు. మహిళల అభ్యున్నతే రాష్ట్ర అభ్యున్నతి అనే దృష్టితో ప్రభుత్వం ముందుకు సాగుతుందని మంత్రి అన్నారు. సమాజ అభివృద్ధిలో మహిళల పాత్రను గుర్తిస్తూ రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయనున్నట్టు సూచించారు.

# ఢిల్లీలో గాలి నాణ్యత తీవ్రంగా క్షీణించడంతో ఆంక్షలు కఠినతరం



414, అశోక్ విహార్‌లో 403, నెహ్రూ నగర్‌లో 402, ఐటీవో ప్రాంతంలో 370గా నమోదు అయింది. దీని వల్ల ఢిల్లీ%%ఎన్‌సీఆర్ ప్రాంతం మొత్తం తీవ్ర కాలుష్య వలయంలో చిక్కుకుంది. పరిస్థితి మరింత దిగజారుతుందనే అంచనాతో కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి అత్యవసర చర్యలు తీసుకుంది. ఎన్‌సీఆర్ లోని ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు 50 శాతం సిబ్బందికి ఇంటి నుంచే పనిచేసే విధానాన్ని అమలు చేయాలని ఆదేశించింది. వాహనాల రాకపోకలను తగ్గించడం ద్వారా ఉద్గారాల ప్రభావాన్ని తగ్గించడమే ఈ చర్య లక్ష్యంగా వెల్లడించింది. కాలుష్య ప్రభావం చిన్నారులపై అధికంగా ఉండటంతో ఢిల్లీ ప్రభుత్వం కూడా కీలక నిర్ణయం తీసుకుంది. పాఠశాలల్లో ఆరుబయట క్రీడలు, కార్యకలాపాలు, ఈవెంట్లను పూర్తిగా నిలిపివేయాలని సూచించింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు ఈ ఆదేశాలు అమల్లోకి వచ్చాయి. ఢిల్లీ%-%ఎన్‌సీఆర్ ప్రాంతంలోని విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, క్రీడా సంఘాలు కూడా ఈ మార్గదర్శకాలను తప్పనిసరిగా అనుసరించాల్సి ఉంటుంది. నిపుణులు గాలి నాణ్యత దిగజారడానికి వాహన ఉద్గారాలు, పరిశ్రమల కాలుష్యం, పంట అవశేషాల దహనం, వాతావరణ మార్పులు ప్రధాన కారణాలుగా పేర్కొంటున్నారు. ప్రజలు బయటికి వెళ్లేటప్పుడు మాస్కులు ధరించాలని, పిల్లలు, వృద్ధులు ఇళ్లలోనే ఉండాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

# భారత పర్యావరణ విధానాల లోపాలు

- వాయు కాలుష్యానికి శాశ్వత పరిష్కారం ఎక్కడ?
- కాలుష్య సంక్షోభం మళ్లీ పెరుగుతున్న ఆందోళన
- పాలసీల అమలులో స్పష్టమైన ఖాళీలు
- శాశ్వత పరిష్కారాల కోసం సమగ్ర దిశ అవసరం

**వేద న్యూస్ డెస్క్:**

భారతదేశంలో వాయు కాలుష్యం ప్రతి సంవత్సరం మళ్లీ అదే తీవ్రతతో వస్తూ ప్రజల ఆరోగ్యాన్ని, ఆర్థిక వ్యవస్థను, నగరాల జీవన ప్రమాణాలను దెబ్బతీస్తోంది. ప్రభుత్వం అనేక పర్యావరణ విధానాలను రూపొందించినప్పటికీ, వాటి అమలులో కనిపిస్తున్న లోపాలు సమస్యను మరింత క్లిష్టం చేస్తున్నాయి. కాలుష్య తగ్గింపుకు చేసిన చర్యలు ఎక్కువగా తాత్కాలికంగానే ఉండటం వల్ల, శాశ్వత పరిష్కారం ఇంకా అందని ద్రాక్షగా మారింది.

దేశంలోని ప్రధాన మెట్రో నగరాలు  ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, బెంగళూరు ప్రతి ఏడాది శీతాకాలం వచ్చేసరికి ప్రమాదకరమైన స్థాయిలను నమోదు చేస్తాయి. పంట అవశేషాల దహనం, వాహనాల పెరుగుదల, పరిశ్రమల ఉద్గారాలు, నిర్మాణ ధూళి ఇవన్నీ కలసి తీవ్రమైన వాయు కాలుష్యానికి దారితీస్తున్నాయి. విధానాలు ఉన్నప్పటికీ, సమన్వయ లోపం, బాధ్యతల స్పష్టత లేకపోవడం సమస్యను మరింత పెంచుతున్నాయని నిపుణులు ప్రశ్నిస్తున్నారు.

పర్యావరణ మంత్రిత్వ శాఖలు అనేక చర్యలు ప్రకటించినప్పటికీ, ఎక్కువగా అవి ప్రతిస్పందనా చర్యలే. ఉదాహరణకు  పెరిగిన తరువాత వాహనాల పరిమితి, కట్టడాలపై తాత్కాలిక నిషేధం, పరిశ్రమలపై రోజువారీ తనిఖీలు ఇవి శాశ్వత పరిష్కారాలు కావు. సమస్య మూలానికి వెళ్లే ప్రయత్నం తక్కువగా కనిపిస్తోంది. ఫార్మ్ ఫైరింగ్‌కు శాస్త్రీయ పరిష్కారాలు అందించకపోవడం, పట్టణ రవాణా వ్యవస్థను బలోపేతం చేయకపోవడం ఈ లోపాల ప్రధాన కారణాలుగా నిపుణులు భావిస్తున్నారు. పాలసీల అమలులోని మరో ప్రధాన సమస్య రాష్ట్ర ప్రభుత్వాలు మరియు కేంద్రం మధ్య సమన్వయం లోపించడం. వాయు కాలుష్యం సరిహద్దులు గుర్తుపట్టదుబీ ఒక రాష్ట్రం తీసుకోని చర్యలు పక్క రాష్ట్రంలో ప్రభావం చూపుతాయి. కానీ సమగ్ర ఆపరేషనల్ ప్లాన్ లేకపోవడం వల్ల కాలుష్య నియంత్రణ చర్యలు విభజితంగా, అసమర్థంగా మారుతున్నాయి. ఇది దేశం మొత్తం ఎదుర్కొనే సమస్య అయినప్పటికీ, పరిష్కారం మాత్రం ప్రాంతాలవారీగా విడిపోయి పోతుంది.

ఇంతలో, భారత యువతలో కూడా వాయు కాలుష్యం ప్రభావం తీవ్రంగా పడుతోంది. శ్వాసకోశ సమస్యలు, అలర్జీలు, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు చిన్న వయసు నుంచే కనిపిస్తున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం, భారతదేశం సంవత్సరానికి లక్షలాది మరణాలను వాయు కాలుష్యం కారణంగానే ఎదుర్కొంటోంది. ఆరోగ్యంపై పడుతున్న ఇది భారీ భారం మాత్రమే కాదుబీ దేశ ఆర్థిక వ్యవస్థపై కూడా దీర్ఘకాలిక ప్రభావం చూపే విషయం.

శాశ్వత పరిష్కారాల కోసం నిపుణులు మూడు ప్రధాన దిశలను సూచిస్తున్నారు. మొదటిది పరిశ్రమల కోసం కఠిన ఉద్గార నియంత్రణను అమలు చేయడం. రెండవది పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌ను అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేసి, వ్యక్తిగత వాహనాల ఆధారాన్ని తగ్గించడం. మూడవది. పంట అవశేషాల నిర్వహణకు రైతులకు శాస్త్రీయ, ఆర్థిక పరమైన ప్రత్యామ్నాయాలను అందించడం. ఈ మూడు అంశాలను సమగ్రంగా అమలు చేస్తేనే వాయు కాలుష్యానికి శాశ్వత పరిష్కారం కనిపిస్తుందని నిపుణుల అభిప్రాయం. మొత్తం మీద, భారత పర్యావరణ విధానాలు ఉండటం సమస్య కాదుబీ అవి నేలమీద ఎలా అమలవుతున్నాయి అనేది ప్రధాన సమస్య. శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం, పరిశ్రమలు, రైతులు, పౌరులు అందరూ కలసి పనిచేయాలి. విభజిత చర్యలు కాకుండా సమగ్ర జాతీయ ప్రణాళికే భారతదేశాన్ని వాయు కాలుష్య సంక్షోభం నుంచి బయటపడేసే మార్గం. నిజమైన మార్పు కోసం సంకల్పం అవసరంబీ లేకపోతే ప్రతి శీతాకాలం ఇదే కథ మళ్లీ మళ్లీ పునరావృతమవుతుంది.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**వేద న్యూస్,బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల అభ్యున్నతి కోసం ఎనలేని కృషి చేస్తుందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, అన్నారు.  బోయినిపల్లి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో కవర్ షెడ్ల నిర్మాణం. రైతు ఎద్దుల బండి విగ్రహాల నిర్మాణం కోసం శనివారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్, తో కలిసి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, మాట్లాడుతూ రైతు సంక్షేమ ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని రైతులకు ఆధునిక వసతులతో మార్కెట్ యార్డులో పనులు చేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు గిట్టుబాటు ధర, సన్నబియ్యానికి బోనస్, రైతుబంధు, పథకాలు అమలు చేస్తూ రైతులను రాజులను చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్, వైస్ చైర్మన్ నిమ్మ వినోద్ రెడ్డి ,పిఎసిఎస్ చైర్మన్లు సురేందర్ రెడ్డి, దుర్గారెడ్డి, తాసిల్దార్ నారాయణ రెడ్డి, ఎంపీడీవో జయశీల ,ఏఓ ప్రణీత, ఎంపీఓ శ్రీధర్,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వన్నెల రమణా రెడ్డి ,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మహేశ్వర్ రెడ్డి , మాజీ ఎంపీపీ పర్లపల్లి



వేణుగోపాల్ కమిటీ డైరెక్టర్లు బాబు,రమేష్,సతీష్,శేఖర్ రెడ్డి, వెంకటేష్, అజయ్,ప్రదీప్,మహేష్,నాయకులు కొడగాని వెంకటేష్, సంభ లక్ష్మి రాజం, ఏనుగుల కనకయ్య, నాగుల వంశీ,ఏమి రెడ్డి సురేందర్ రెడ్డి, జోగు రవీందర్, జంగం అంజయ్య, రామిడి శ్రీనివాస్, ఉయ్యాల శ్రీనివాస్, కొమ్మ నబోయిన సువిన్ యాదవ్ ,జంగ సత్యం,నల్ల మోహన్, బోయిని పరుశు రాం, బొజ్జ మహేందర్, పొత్తూరి మహేందర్, మెరుపుల జలంధర్, బోయిని లచ్చయ్య, తదితరులు ఉన్నారు.

# "నాస్తి"గా ఉన్న వాస్తు

**వేద న్యూస్,బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం జన విజ్ఞాన వేదిక ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యవస్థాపక కన్వీనర్  సి రామరాజు, మాట్లాడుతూ వాస్తు ప్రకారం తమ ఇంటి ద్వారాలు, గోడలు, కిటికీలు, అలమారాలు, లాంటివి మార్పులు చేర్పుల వల్ల ఆయుష్షు, ఆరోగ్యం, ఐశ్వర్యాలు, అందరికీ సమకూరుతాయని ఆశ కల్పించడం అవి చేయకపోతే ఇంకా కష్టనష్టాలు జరుగుతుంటాయని భయం కలిగేలా చేసి వాస్తు గురించి చెప్పేవాళ్లు నమ్మిస్తూ ఉంటారు. అవి అలా వాళ్ళు చెప్పిన ప్రకారం జరిగితే అప్పటికే ఇలాంటి వారందరి మాటలు నమ్మి మార్పు చేయించుకొనిన వారందరికీ ఏ ఇబ్బందులు ఏ సమస్యలు లేకుండా జరిగిపోతూ ఉండాలి కదా! ఈ వాస్తు నిపుణుల వల్ల ఇంత మేలు జరుగుతున్నట్లయితే వీళ్లే ప్రజలందరి దగ్గరకు పోయి వాస్తు గురించి చెప్పుకోవలసిన అవసరం లేకుండా ప్రభుత్వం వారే వేలాది వాస్తు శాస్త్రజ్ఞులను ఒక చోట చేర్చి దీనికోసం ప్రభుత్వంలో ఒక శాఖను ఏర్పాటు చేసి దేశంలో కట్టబోయే లక్షల ఇండ్ల నన్నింటిని వీళ్ళు చెప్పినట్టుగానే కట్టించి ప్రజలకు కేటాయించడం ద్వారా ఆ ఇళ్లలో నివసించే అందరికీ ఆయుష్షు, ఆరోగ్యం,ఐశ్వర్యం, సమ కూరుతున్నప్పుడు ప్రభుత్వ ఆరోగ్య ఆర్థిక సమస్యలు పరిష్కారం అవడానికి బరువు బాధ్యతలు ఎన్నో తగ్గిపోవడానికి దోహదపడుతుంది కదా! ఇవన్నీ ఇలా దేశ వ్యాప్తంగా జరిగినప్పుడు ప్రపంచంలోనే మన దేశం అన్ని రంగాల్లో అగ్రగామిగా మారడానికి ఎంతో అవకాశం ఉంది కదా! అలా ఎందుకు చేయకూడదు? ఇలాంటి మార్పులు చేయించుకోవడం ద్వారా దేశవ్యాప్త సమస్యలన్నీ ఇప్పటికే పరిష్కారం అయిపోయి ఉండాలి. కానీ అలా జరగకపోగా ఈ సమస్యలు అన్నిచోట్ల ఎందుకు పెరిగిపోతున్నాయి? కావున పూర్తిగా అవాస్తవమేనని అవగత మవుతుంది. ఆ ఇంటి యజమాని నిర్వహించే పనులు ఆయన దక్షత గుణగణాలు సమస్యల ఎడల ఆయనకున్న ఆలోచన దృక్పథం ఆయుష్షు, ఆరోగ్యం, ఈ బాగోగులన్నీ అనేక అంశాలపై ఆధారపడి ఉంటాయి. అందువల్ల వీరు చెపుతున్న వాస్తు అనేది పూర్తిగా వాస్తవ



విరుద్ధమని అలాంటి సలహాలతో మార్చినవాళ్లు మార్చని వాళ్ళతో పోల్చి చూసుకుంటే వారికి వీరికి ఆనాడు ఎదురయ్యే సామాజిక సమస్యల పరిష్కారంలో ఏ విధమైన తేడాలు ఉండవని అందరికీ బోధపడుతుంది.వాస్తు అశాస్త్రీయం.అని అన్నారు.

# ఘనంగా జన జాగరణ గృహ సంపర్క అభియాన్

**వేద న్యూస్,బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం ఆర్ఎస్ఎస్ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జన జాగరణ గృహ సంపర్క అభియాన్ కార్యక్రమంలో భాగంగా బోయినిపల్లి మండల కేంద్రంలో ఆర్ఎస్ఎస్ జన జాగరణ కార్యక్రమం, విభాగ్ సహకార్యవాహ్ రాజన్న, ఆధ్వర్యంలో ప్రారంభించడం జరిగినది.ఈ సందర్భంగా వారు ప్రజలకు తెలియజేస్తూ..నిత్యము దేశ హితం ,దేశ నిర్మాణం, కోసం పని చేసిన ఆర్ఎస్ఎస్, ఇప్పటివరకు ప్రచారాన్ని కోరుకోలేదు. సంఘం ప్రారంభించి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సంఘ కార్యకర్తలు ప్రతి ఇంటికి సంఘం గురించి వివరిస్తారని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో  ఆర్ ఎస్ ఎస్, విభాగ్ ప్రచారక్ శివన్న, బిజెపి మండల అధ్యక్షులు ఎడపల్లి పరశురామ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఉదారి నరసింహ చారి, సీనియర్ నాయకులు జువ్వెంతుల శ్రీనివాస్ రెడ్డి ,రాజురీ కిరణ్ ,మెరుపుల గంగాధర్,శరత్ చంద్రారెడ్డి , స్వామి కుమార్, బ్రహ్మ ప్రసాద్, సురేష్ ,అజయ్  ,కార్తీక్ , సంఘ కార్యకర్తలు పాల్గొన్నారు.



# 24 మందికి జైలు శిక్ష..!

**వేద న్యూస్,వేములవాడ:**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జిల్లా ఎస్పీ  ఆదేశాల మేరకు పట్టణ పరిధిలో  డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీ లు నిర్వహించగా 87 మంది మందు బాబు లు పట్టుబడగా వారిని వేములవాడ పోలీసులు శనివారం రోజున  కోర్టులో ప్రవేశపెట్టగా 24 మంది మందుబాబులకు జైలు శిక్షలు, జరిమానాలు,63 మందికి జరిమానాలు విధిస్తు వేములవాడ మేజిస్ట్రేట్ జ్యోతిర్మయి తీర్పు వెల్లడించినట్లు టౌన్ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సి.ఐ  మాట్లాడుతూ ప్రతి రోజు పట్టణ ప్పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, వాహన తనిఖీలు నిర్వహించాడం జరిగుతుందని, మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడిన వ్యక్తుల పై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మద్యం సేవిం చి వాహనాలు నడుపుతు పట్టుబడిన వారికి వారి తల్లితండ్రుల, లేదా కుటుంబ పెద్దల సమక్షంలో కౌన్సెల్లింగ్ ఇవ్వడం జరిగుతుందని అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడితే భవిష్యత్తులో వచ్చే ఉద్యోగ అవకాశాలు కానీ, ఉపాధి అవకాశలకు పోలీస్ వెరైఫికేషన్ సమయం లో ఇబ్బందులు కలుగుతయని,ట్రాఫిక్, రోడ్ భద్ర ్త నియమ నిబంధనలను ఉల్లంఘిస్తే వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.




# పంచాయతీ అధికారులపై గ్రామస్తుల ఆగ్రహం..!

**వేద న్యూస్, మెట్ పల్లి :**

జగిత్యాల జిల్లా మెట్ పల్లి మండలం రాజేశ్వరరావు పేట్ గ్రామంలో గ్రామ పంచాయతీ అధికారులు ప్రభుత్వ ఆస్తులను తన సొంత అవసరాలకు వాడుకుంటున్నారు.చెత్త సేకరించుటకై ఏర్పాటు చేసిన ట్రాక్టర్ను తమ సొంత అవసరాలకు వాడుకోవడం పట్ల గ్రామస్తులు ఆగ్రహిస్తున్నారు. అనేకమార్లు గ్రామస్తులు అధికారులకు సూచించినప్పటికీ పంచాయతీ కార్యదర్శి తన ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారంటూ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో అవకతవకలకు పాల్పడుతున్నారని గ్రామస్తులు మీడియాకు తెలిపారు. పై అధికారులు సమగ్ర విచారణ చేపట్టి పంచాయతీ కార్యదర్శి పై చర్యలు తీసుకోవాల్సిందిగా గ్రామస్తులు కోరుతున్నారు.



వేద న్యూస్

ఆదివారం, నవంబర్ 23, 2025

# బాధ్యతల స్వీకరణ..

**– టేక్మాల్ పీఏసీఎస్ చైర్మన్‌గా యశ్వంత్‌రెడ్డి**



**వేద న్యూస్ టేక్మాల్:**

మెదక్ జిల్లా టేక్మాల్ మండల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ గా యశ్వంత్‌రెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. గత కొంతకాలంగా మండలంలో ప్రధాన రాజకీయ పార్టీలో నెలకొన్న వివాదం కారణంగా చైర్మన్ పదవి తమదంటే తమదంటూ అనుకొని రెండు వర్గాలు రెండు చైర్మన్ లుగా ఎన్నుకున్నారు. తప్పుడు నివేదికలను సమర్పించి తమను దోషిగా పరిగణిస్తున్నారంటూ హైకోర్టులో యశ్వంత్ రెడ్డి వేసిన పిటిషన్ ను స్వీకరించి చైర్మన్ యశ్వంత్ రెడ్డి యే చైర్మన్‌గా కొనసాగుతారని తీర్పునిచ్చింది. ఈ మేరకు తిరిగి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రైతు సహకార సంఘాన్ని రాజకీయ రంగుతో ముక్కలు చేయకుండా అభివృద్ధి పథంలో తీసుకెళ్తామని, అందుకు రైతులందరి సహకారం అవసరమని పేర్కొన్నారు. రెండు పార్టీల వివాదం కారణంగా సొసైటీ నష్టాల ఊబిలో చిక్కుకుందని, దాన్ని తిరిగి లాభాల బాటలోకి తెచ్చేందుకు కృషి చేస్తామని చెప్పారు. తనపై నమ్మకం ఉంచి రైతులందరూ సహకరించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా యశ్వంత్ రెడ్డిని బీఆర్ఎస్ నాయకులు, రైతులు పూలమాలలు వేసి శాలువాలతో సన్మానించారు. ఇందులో మండల రైతులు, మండల పార్టీ అధ్యక్షుడు వీరప్ప, నాయకులు సిద్దయ్య, సలీం,భాస్కర్, గోవిందా చారి,ముక్తార్ తదితరులున్నారు.

# అంగన్‌వాడీ సరుకులు అంగడిపాలు!

**వేద న్యూస్, టేక్మాల్:**



మెదక్ జిల్లా ఆందోల్ నియో జకవర్గం టేక్మాల్ మండల పరిధి లోని కాద్లూ ర్ గ్రామంలోని అం గన్ వాడీ కేంద్రం టీచర్.. సరుకులను మార్కెట్‌కు ఆటోలో తం్లిస్తూ.. సొమ్ము చేసుకుంటు న్నారని స్థానికులు ఆరోపిస్తున్నా రు. పిల్లలు, గర్భిణులకు ఇచ్చే గుడ్లు ఇతర నిత్యావసరాలను ఇతరులకు అమ్ముకుంటున్నారని పేర్కొన్నారు. అధికారులు పర్యవేక్షణ లోపం వల్లే టీచర్ ఇష్టా రాజ్యాంగ వ్యవహరిస్తున్నారని, దీనిపై విచారణ జరిపి చర్య తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. జిల్లా వెల్ఫేర్ ఆఫీసర్ హెమ భార్గ విని ఈ విషయమై వివరణ కోరగా, సమగ్ర విచారణ జరిపి రుజువైతె శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని తెలి పారు.

# ‘ఆదిత్య’ ఆస్పత్రిలో ఉచిత షుగర్ టెస్ట్

**వేద న్యూస్, జమ్మికుంట:**

జమ్మికుంట పట్టణంలోని కొండూరి కాంప్లెక్స్, కాకతీయ టెక్నో స్కూల్ పక్కన గల ఆదిత్య మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి వారు ప్రతీ రోజూ ఉచితంగా షుగర్ టెస్ట్(ఎఫ్‌బీఎస్/పీఎల్‌బీఎస్) చేయనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. భారతీయుల్లో షుగర్(మధుమేహం) కామన్ హెల్త్ ఇష్యూగా ఉంటోందని ఇటీవల పలు సర్వేల్లో తేలింది. ఈ నేపథ్యంలో మీ కుటుంబంలో ఎవరైనా షుగర్‌తో బాధపడుతున్నట్టయితే మీకు కూడా షుగర్ వచ్చే చాన్సెస్ ఉంటాయని, ఆలస్యం చేయకుండా ముందుగానే తగు పరీక్షలు చేయించుకోవడం ఉత్తమమని నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలోనే ఫ్రీగానే ఆదిత్య మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో షుగర్ టెస్ట్ చేస్తున్న సందర్భంగా జమ్మికుంట పట్టణ, మండల, పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. ఆస్పత్రిలో నిపు ణులైన వైద్యులు అందుబాటులో ఉంటారని వెల్లడించారు. ఎంబీబీ ఎస్ ఎండీ జనరల్ మెడిసిన్ డాక్టర్ ఆకుల శ్రీనివాస్ ఆస్పత్రిలో పేషెంట్స్‌కు చక్కటి వైద్యం అందిస్తున్నట్టు తెలిపారు.

# కమలదళ సైనికుడు శివ

**– బీజేపీ బలోపేతమే ధ్యేయంగా యువనేత అడుగులు**

**వేద న్యూస్, వరంగల్:**





యువ నాయకుడు లడె శివ బీజేపీ సైనికుడిగా పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తూ ముందుకు సాగుతున్నారు. విద్యారంగంలో సమస్యల పరిష్కారానికి పోరాడుతూనే.. మరో వైపున యువతకు అన్ని రంగాల్లో అవకాశాలు, రాజకీయ ఎదుగుదలపైనే గళం వినిపిస్తున్నారు. శాయంపేట మండల యువనేతగా ఉన్న శివ.. క్షేత్రస్థాయితో పాటు జిల్లా పరిధిలో కాషాయ పార్టీ సైనికుడిగా.. పార్టీ సంస్థాగత బలోపేతానికి శక్తివంచన లేకుండా పాటు పడుతున్నారు. రాష్ట్ర సర్కారు బీసీలకు రిజర్వేషన్ల విషయమై చిత్తశుద్ధితో ముందుకెళ్లాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ నిలబెట్టుకోవాలని నిత్యం కొట్లాడుతున్నారు. ప్రజల్లో ప్రశ్నించే తత్వాన్ని, పోరాటపటిమను పెంపొందించేందుకుగాను బీజేపీ తరఫున యువవాదిగా, దేశం పట్ల నిండుగా దేశభక్తి కలిగిన సైనికుడిగా తన వంతుగా యువ నాయకుడు లడె శివ విశేష కృషి చేస్తున్నారు.

# ఘనంగా మాజీ ఎమ్మెల్యే దాస్యం బర్త్ డే వేడుకలు

**వేద న్యూస్, వరంగల్:**



వరంగల్ పశ్చిమ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ బర్త్ డే వేడుకలను శనివారం ఆయన అనుచరులు, బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. గత 8 సంవత్సరాల నుండి ఎన్నో పర్యావరణ, అటవీ పరిరక్షణకు ప్రత్యక్షంగా, పరోక్షంగా అన్ని కార్యక్రమాలకు దాస్యం సహకరిస్తున్నారని ఓరుగల్లు వైల్డ్ లైఫ్ ఫౌండర్ ప్రెసిడెంట్ ప్రెసిడెంట్ ఇందారం నాగేశ్వర్ రావు, ఫౌండర్ సెక్రెటరీ చేలుపూరు శ్యామ్ సుందర్, ప్రముఖ పర్యావరణవేత్త, జాయింట్ సెక్రటరీ రవిబాబు పిట్టల తెలిపారు. వినయ్ భాస్కర్‌కు హృదయ పూర్వక పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పర్యావరణ ప్రేమికుడైన వినయ్‌భాస్కర్‌తో కలిసి మొక్కలు నాటారు.

# పెన్నా నదిలో ఆరుగురు పశువుల కాపర్లు గల్లంతు

**అమరావతి వేద న్యూస్ :**



ఆంధ్రప్రదేశ్‌లో విషాద ఘటన చోటు చేసుకుంది. నెల్లూరు జిల్లా ఆత్మకూరు మండలం అప్పారావుపాలెం వద్ద పెన్నానదిలో ఆరుగురు పశువుల కాపర్లు గల్లంతు అయ్యారు. పశువులను మేపడానికి వెళ్లి తిరిగివస్తుండగా ఒక్కసారిగా వరద పెరగడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. వెంకటరమణయ్య, శ్రీనివాసులు, కాలేషా, చెన్నయ్య, కవిత, మరో మహిళ నీటి ప్రవాహంలో కొట్టుకుపోయారు. గల్లంతయైన వారిని కాపాడేందుకు పోలీసులు, ఫైర్ సిబ్బంది హుటాహుటినా ఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు మొదలు పెట్టారు.

# పీహెచ్ సీని ఆకస్మిక తనిఖీ

**వేద న్యూస్, బోయినిపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్,ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది హాజరు, ఓపీ, మందుల రిజిస్టర్, వ్యాక్సిన్ గది, మందులు ఇచ్చే గదిని పరిశీలించారు. దవాఖానలో అందుతున్న వైద్య సేవలపై రోగుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, మాట్లాడారు. గర్భిణీలు అందరూ ప్రభుత్వ దవాఖానల్లో పేర్లు నమోదు చేసుకునేలా చూడాలని, ఇక్కడ అందుతున్న సేవలు, వసతులపై క్షేత్ర స్థాయిలో వైద్య సిబ్బందికి అవగాహన కల్పించాలని, నిరంతరం పరీక్షలు చేసి వైద్యం అందించాలని సూచించారు. సర్కార్ దవాఖానల్లోనే ప్రసవాలు చేసుకునేలా ప్రోత్సహించాలని పేర్కొన్నారు. ఆశా, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి, సీజనల్ వ్యాధులు తదితర అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు.

# మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి



**వేద న్యూస్,బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం కేజీబీవీలో ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఆకస్మిక తనిఖీ నిర్వహించి విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం ఇవ్వాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఆదేశించారు. బోయినిపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల, విద్యాలయం(కేజీబీవీ)ను ఇంచార్జి కలెక్టర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా స్టోర్ రూమ్ లో ఆహార సామగ్రి, కోడి గుడ్లు, కూరగాయలు, పరిశీలించారు. మెనూ ప్రకారం చికెన్, మటన్, కోడి గుడ్లు ఇస్తున్నారా అని ఆరా తీశారు. విద్యార్థులు పోషకాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని వివరించారు. ఈ సందర్భంగా విద్యాలయంలో 6వ, 9 వ తరగతి విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. విద్యార్థులందరూ చదువుపై శ్రద్ధపెట్టాలని, ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని పేర్కొన్నారు. తాము అనుకున్న ఉద్యోగాలు, ఉన్నత స్థానాలకు ఎదగా లని పిలుపునిచ్చారు. ఆర్థికంగా స్థిరప డాలని ఆకాంక్షించారు. విద్యాలయం ఆవర ణ నిత్యం పరిశుభ్రంగా ఉండాలని, ఏమైనా ఇబ్బందులు ఉంటే జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని సూచించారు.

# హమాలీల కొరత లేకుండా చూడాలి

**వేద న్యూస్,ఎల్లారెడ్డిపేట:**



కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చే ధాన్యాన్ని రైస్ మిల్లర్లు ఎప్పటికప్పుడు తీసుకోవాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. గంభీరావుపేట మండలంలోని సముద్ర లింగా పూర్, గజసింగవరం, గోరంటాల, గంభీరావు పేట, లింగన్నపేట, ముస్తఫానగర్, ఎల్లారెడ్డిపేట మండలంలోని వెంకటాపూర్, పదిర, రాగట్లపల్లి, నారాయణపూర్, ఎల్లారెడ్డిపేట, బొప్పాపూర్, తిమ్మాపూర్, కిషన్ దాస్ పేటలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో శనివారం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తనిఖీ చేశారు. ధాన్యం కుప్పలు, తేమ శాతం తదితర అంశాలు పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడారు. రైస్ మిల్లర్లు ధాన్యాన్ని ఎప్పటికప్పుడు దించుకొని ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. హమాలీల కొరత లేకుండా చూసుకోవాలని సూచించారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. కార్యక్రమంలో గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట తహసీల్దార్లు మారుతి రెడ్డి, సుజాత తదితరులు ఉన్నారు.

# ప్రమాదకరంగా బ్రిడ్జి పై గుంతలు..!

**వేద న్యూస్,బోయినిపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం దేశాయిపల్లి కెనాల్ బ్రిడ్జి పై రోడ్డు కోదురుపాక నుండి బోయినిపల్లి మీదుగా గంగాధర, వరకు కలిసి ఉన్న ప్రధాన రహదారి ఈ దేశాయిపల్లి బ్రిడ్జి పై రోడ్డు గుంతలు పడి మధ్యలో ఇనుప సలాకలు, బయటకు కనిపిస్తున్నాయి. వాహనాలు గుంతలుపై వెళ్ళినప్పుడు అ స్టీల్ రాడ్డు లు వాహనాలకు తగిలే అంత ప్రమాద కరంగా మారింది. ఈ దారి గుండా నిత్యం వేల సంఖ్యలో వాహ నాలు రాకపోకలు సాగి స్తుంటాయి. వాహనాలు రోడ్డు పై వెళ్లేటప్పుడు అ రాడ్డు బండి టైర్ కు తగిలితే ప్రాణాలు పోయే అంత ప్రమాదకరంగా మారింది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ఎలాంటి ప్రమాదం జరగక ముందే సంబంధిత అధికారులు స్పందించి దారిని మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

# బైక్‌ను ఢీ కొట్టిన లారీ!

**వేద న్యూస్,బోయినిపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం వెంకట్రావుపల్లి వద్ద ఉదయం గంగాధర మండలం ఒద్యారం గ్రామానికి చెందిన బాలసంకుల గిరిధర్ తన ద్విచక్రవాహనం పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో.. వెంకట్రావుపల్లి గ్రామ చౌరస్తా సమీపంలోని బ్రిడ్జ్ వద్ద ఆ బైక్‌ను టిప్పర్ ఢీ కొట్టింది.! టిప్పర్ డ్రైవర్ దిలీప్ తాతెరావు భగత్, తన టిప్పర్ వాహనాన్ని అధిక వేగంగా, నిర్లక్ష్యంగా నడపడం వల్ల గిరిధర్‌ను, వెనక వైపు నుండి ఢీకొట్టగా,గిరిధర్, కిందపడటం తో గాయాలపాలయ్యాడు. ప్రస్తుతం గిరిధర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. గిరిధర్ అన్న మదన లక్ష్మయ్య ఈ మేరకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు బోయినిపల్లి ఎస్ఐ రామకాంత్ తెలిపారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073

# దొంగతనం నేరం

## - పైరసీపై బన్నీ వాసు ఘాటు హెచ్చరిక



**వేద న్యూస్, డెస్క్:**

టాలీవుడ్‌లో పైరసీ వ్యవహారం మరోసారి వేడెక్కింది. 'ఐబొమ్మ' నిర్వహిస్తున్నాడని ఆరోపణలపై నిర్వాహకుడు రవి అరెస్టై వార్తల్లో నిలిచిన సందర్భంలో, సోషల్ మీడియాలో మాత్రం ఆశ్చర్యకరమైన ధోరణి పెరుగుతోంది. సినిమా టికెట్ ధరలు ఎక్కువైపోయాయనే కారణంతో పైరసీని సమర్థిస్తూ పలువురు రాసే పోస్టులు, వేస్తున్న వీడియోలు పరిశ్రమలో సీరియస్ చర్చకు దారితీశాయి. "మాకు పైరసీ చేసే వాడే హీరో" అంటూ కొందరు పెట్టిన వ్యాఖ్యలు సినీ వర్గాల్లో తీవ్ర ఆందోళనను రేపుతున్నాయి. ఈ పరిణామాల నడుమ ప్రముఖ నిర్మాత బన్నీ వాసు ఘాటుగా స్పందించారు. 'రాజు వెడ్స్ రాంబాయి' సినిమా కార్యక్రమంలో పాల్గొన్న సమయంలో రిపోర్టర్ అడిగిన ప్రశ్నకు సమాధానం ఇస్తూ ఆయన పైరసీని సమర్థించే కొత్త ట్రెండ్‌పై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు .పైరసీకి కారణంగా టికెట్ ధరలను చూపించడం పూర్తిగా తప్పుడు తర్కమని ఆయన స్పష్టం చేశారు. సంవత్సరం పొడవునా రావొచ్చు నూరు సినిమాల్లో కేవలం 10–15 భారీ చిత్రాలకే రేట్లు ఎక్కువగా ఉంటాయని, కానీ మిగిలిన చిన్న సినిమాలు మాత్రం చాలా తక్కువ ధరల్లోనే అందుబాటులో ఉంటాయని గుర్తుచేశారు. "అయితే వాటినీ ఎందుకు పైరసీలో చూస్తున్నారు? కష్టపడి తీసిన చిన్న సినిమాలు కూడా పైరసీ వల్లే చనిపోతున్నాయి" అని ఆయన గట్టిగా ప్రశ్నించారు. నిర్మాతల పరిస్థితి గురించి మాట్లాడిన సమయంలో బన్నీ వాసు భావోద్వేగానికి గురయ్యారు. ప్రజలకి నిర్మాత అంటే కోట్లు పెట్టి సినిమాలు తీసేవారన్న అంచనా ఉన్నప్పటికీ, వాస్తవం పూర్తిగా భిన్నమని చెప్పారు. "ఎంతో మంది తమ ఆస్తులు అమ్ముకుని సినిమాలు తీస్తారు. బయట నవ్వుతూ కనిపిస్తారు కానీ లోపల పడే ఇబ్బందులు అర్థం చేసుకునేవారు చాలా తక్కువ" అని తెలిపారు లోపల పడే ఇబ్బందులు అర్థం చేసుకునేవారు చాలా తక్కువ""ఎంతో మంది తమ ఆస్తులు అమ్ముకుని సినిమాలు తీస్తారు .పైరసీని "దొంగతనం"గా అభివర్ణించిన బన్నీ వాసు, దానిని గ్లోరిఫై చేయడం మరింత పెద్ద ప్రమాదమని హెచ్చరించారు.

# ఆర్జీవీ ప్రత్యేకం

## - ఊహకు అందని ఆలోచనలు ఆయన సొంతం
## - నాతో పాడించాడు.. డ్యాన్స్ చేయించాడు..మనోజ్ బాజ్‌పేయి



**వేద న్యూస్, డెస్క్:**

ప్రతిసారి విభిన్నంగా ఆలోచించే దర్శకుడు రాంగోపాల్ వర్మకు, తనదైన శైలిలో నటన చాటుకునే మనోజ్ బాజ్‌పేయికి ప్రత్యేకమైన అనుబంధం ఉంది. 1998లో వచ్చిన కల్ట్ గ్యాంగ్‌స్టర్ కథాచిత్రం 'సత్య' ద్వారా ఈ కాంబినేషన్ ప్రేక్షకుల మదిలో చిరస్థాయిగా నిలిచింది. ఆ తరువాత వచ్చిన 'సర్కార్ 3' కూడా మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఇప్పుడు ఈ జంట మళ్లీ హారర్ కామెడీ నేపథ్యంలో తెరకెక్కుతున్న 'పోలీస్ స్టేషన్‌లో భూతం' సినిమాతో మరోసారి ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రంలో మనోజ్ బాజ్‌పేయి ప్రధాన పాత్రలో కనిపించగా, జెనీలియా దేశ్‌ముఖ్, రమ్యకృష్ణ కీలకపాత్రల్లో నటిస్తున్నారు. చాలా కాలం తర్వాత వర్మ కాంపౌండ్ నుంచి వస్తున్న ఈ విభిన్న ప్రయత్నంపై ఇప్పటికే మంచి ఆసక్తి నెలకొంది. తాజాగా గోవాలో మీడియాతో మాట్లాడిన మనోజ్ బాజ్‌పేయి, షూటింగ్ అనుభవాల్ని పంచుకుంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. "ఈ సినిమా షూట్ పూర్తయ్యే దశలో ఉంది. వర్మతో పనిచేయడం ఎప్పుడూ ప్రత్యేకమే. ఇతరులు చేయలేని పనులు, ఊహించని విధాల నన్ను ఉపయోగించడంలో అతడికి ప్రత్యేకమైన పట్టు ఉంది. ఈ సినిమాలో మీరు నన్ను పాడుతూ, డ్యాన్స్ చేస్తూ, భయపడుతూ, మరికొన్ని సందర్భాల్లో భయపెడుతున్నట్టూ చూస్తారు," అని మనోజ్ నవ్వుతూ చెప్పాడు. ఈ వ్యాఖ్యలు బయటకు రాగానే సామాజిక వేదికల్లో వైరల్ అవుతూ సినిమాపై మరింత ఆసక్తి పెంచుతున్నాయి. ఇటీవలే రమ్యకృష్ణ క్యారెక్టర్ లుక్‌ను విడుదల చేయగా, నుదుటి నుంచి గదవ వరకూ వరుసగా వేసుకున్న చుక్కల బొట్టు, మెడనిండా ప్రత్యేకమైన ఆభరణాలు, కొత్త మేకోవర్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. కథ ప్రకారం..ఒక భయంకర గ్యాంగ్‌స్టర్ ఓ ప్రత్యేక దళ అధికారి చేతిలో ఎదురుకాల్పుల్లో చనిపోతాడు. కానీ అతడు పోలీస్ స్టేషన్‌ను వెంటాడేందుకు భూతం రూపంలో తిరిగి రావడం కథలో ప్రధాన మలుపు. అందుకే టైటిల్‌ను 'పోలీస్ స్టేషన్‌లో భూతం'గా నిర్ణయించినట్టు సమాచారం. "చనిపోయిన వారిని నువ్వు అరెస్ట్ చేయలేవు" అన్న ఆర్జీవీ మాట సినిమా చుట్టూ ఉన్న సస్పెన్స్, ఆసక్తిని మరింత పెంచుతోంది. సినిమా విడుదలపై ప్రేక్షకుల్లో ఇప్పటికే మంచి హైప్ క్రియేట్ అవుతోంది.

# అమరావతిని అధికారిక రాజధానిగా ధ్రువీకరించే గెజిట్

## - పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో బిల్లు ప్రవేశపెట్టే అవకాశం
## - ప్రపంచ స్థాయి రాజధాని కోసం దీర్ఘకాలిక మాస్టర్ ప్లాన్

**అమరావతి, వేద న్యూస్**

ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని అధికారికంగా ధ్రువీకరించే గెజిట్ బిల్లు త్వరలోనే పార్లమెంట్‌లో ప్రవేశపెట్టబడనున్నట్లు కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ప్రకటించారు. అమరావతి సంబంధిత గెజిట్ ప్రక్రియ చివరి దశలో ఉందని, ప్రస్తుతం హోంశాఖలో ఫైల్ క్లియర్ అయి, న్యాయ శాఖలో పరిశీలన జరుగుతోందని తెలిపారు. రాబోయే శీతాకాల సమావేశాల్లో ఈ బిల్లు పెట్టే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన పెమ్మసాని చంద్రశేఖర్, అమరావతి రైతులకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం విశేష పురోగతి సాధించిందని అన్నారు. ఇప్పటివరకు 98 శాతం రైతులకు రిటర్న్ ప్లాట్ల పంపిణీ పూర్తయిందని, మిగిలిన రెండు శాతం సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అమరావతిని ప్రపంచ స్థాయి రాజధానిగా అభివృద్ధి చేయడానికి దీర్ఘకాలిక మాస్టర్ ప్లాన్ సిద్ధమవుతోందని మంత్రి వెల్లడించారు. వచ్చే 15 ఏళ్లలో జనాభా పెరుగుదల, వ్యాపార%–%ఆర్థిక విస్తరణ, రవాణా సౌకర్యాలు, పచ్చదనం, మౌలిక వసతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని సమగ్ర ప్రణాళిక రూపొందిస్తున్నట్టు చెప్పారు. అంతర్జాతీయ స్థాయి సంస్థలు ఇప్పటికే అమరావతి అభివృద్ధి పట్ల ఆసక్తి చూపుతున్నాయని, ఈ ప్రాజెక్టు భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్ ముఖచిత్రాన్ని మార్చేలా రూపొందించబడుతోందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.



# కోటబొమ్మాళిలో కొత్త ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

## - మద్దతు ధరతో వేగవంతమైన చెల్లింపులు
## - పారదర్శక విధానంతో దళారుల జోక్యానికి చెక్



**కోటబొమ్మాళి, వేద న్యూస్**

టెక్కలి నియోజకవర్గంలోని కోటబొమ్మాళి మండల కేంద్రంలో నూతన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు ప్రారంభించారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వము చేపట్టిన ఈ చర్య రైతాంగానికి నేరుగా లాభం చేకూర్చేలా ఉందని ఆయన పేర్కొన్నారు. రైతులు పండించిన ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్న భరోసాను అచ్చెన్నాయుడు స్పష్టంగా తెలిపారు. కేవలం ప్రభుత్వ కనీస మద్దతు ధరతోనే ధాన్యం సేకరణ జరుగుతుందని, రైతులు సరైన ధర పొందే విధంగా కేంద్రాలు పనిచేస్తాయని వివరించారు. ధాన్యం విక్రయించిన 24 - 48 గంటల్లోనే రైతుల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా చెల్లింపులు జమ చేస్తామని అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారు. కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి జాప్యం, ఆలస్యం, మధ్యవర్తుల జోక్యం లేకుండా సంపూర్ణ పారదర్శకత పాటించనున్నట్లు తెలిపారు. రైతులు దళారుల మాటలు నమ్మి నష్టపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

# పుట్టపర్తిలో ఆధ్యాత్మిక వాతావరణం

## - సత్యసాయి శతజయంతి ఉత్సవాల్లో రాష్ట్రపతి, ముఖ్యమంత్రి
## - సమన్వితి ప్రపంచం కోసం సేవా సందేశం



**పుట్టపర్తి, వేద న్యూస్**

పుట్టపర్తిలో జరుగుతున్న భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాలు ఆధ్యాత్మిక భక్తి, సేవా భావంతో కోలాహలంగా కొనసాగు తున్నాయి. ఈ వేడుకల్లో భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో కలిసి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. కార్యక్రమాల్లో పాల్గొన్న నాయకులు సత్యసాయి బాబా బోధనలను స్మరించుకున్నారు. సాయి కుల్వంత్ హాలులో రాష్ట్రపతి, ముఖ్యమంత్రి, మంత్రులు కలిసి సత్యసాయి మహాసమాధిని దర్శించి పూజలు చేశారు. అనంతరం జరిగిన శతజయంతి సభలో భగవాన్ సత్యసాయి బాబా సేవా తత్వాన్ని రాష్ట్రపతి ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆయన జీవితాంతం మానవ సంక్షేమం కోసం పనిచేశారని, ఆయన సందేశాలు నేటికీ కోట్లాది మంది ప్రజలకు ప్రేరణగా నిలుస్తున్నాయని అన్నారు. భారతీయ విలువలైన సత్యం, శాంతి, ప్రేమ, సేమఇవి సమాజాన్ని సమన్వయంతో ముందుకు నడిపే శక్తులని ప్రముఖులు తెలియజేశారు. సమగ్ర మానవతా దృష్టిని ప్రపంచానికి అందించిన సత్యసాయి తత్వం, సామరస్యంతో కూడిన ప్రపంచ నిర్మాణానికి మార్గదర్శకమని పేర్కొన్నారు. ఈ శతజయంతి ఉత్సవాల ద్వారా సత్యసాయి బాబా చూపిన సేవా మార్గాన్ని కొనసాగించాలనే పిలుపు పలికారు. పుట్టపర్తి కార్యక్రమాలు రాష్ట్రానికి, దేశానికి ఆధ్యాత్మిక ప్రేరణనిచ్చే వేదికగా మారాయి.

# అండర్ - 19 రాష్ట్ర హాకీ చాంపియన్‌షిప్ ప్రారంభం

**నక్కపల్లి, వేద న్యూస్**



మంత్రి అనిత వంగలపూడి

69వ ఆంధ్రప్రదేశ్ అంతర జిల్లా స్కూల్ గేమ్స్‌లో భాగంగా నక్కపల్లి లో అండర్ - 19 బాల బాలికల హాకీ చాంపి యన్‌షిప్ పోటీలను మంత్రి అనిత ఘనంగా ప్రారంభిం చారు. రాష్ట్రంలోని అన్ని జిల్లా ల నుంచి విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొనడం వల్ల నక్కపల్లి క్రీడామైదానం క్రీడాస్ఫూర్తితో సందడిగా మారింది. కార్యక్రమం ప్రారంభానికి ముందుగా హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల అర్పించి నివాళులు ఘటించారు. భారత క్రీడల చరిత్రలో ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకుంటూ నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు స్మరణాంజలి అర్పించారు. తరువాత విద్యార్థి క్రీడాకారులతో పరిచయం చేసుకున్న మంత్రి అనిత వంగలపూడి, వారికి ఉత్తేజం నింపుతూ క్రీడల విలువను వివరించారు. క్రీడల్లో పాల్గొనే పిల్లలు శారీరకంగా, మానసికంగా మరింత బలంగా తయారవుతారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి నిరంతరం కట్టుబడి ఉందని, యువతకు ఆధునిక సదుపాయాలు అందించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని ఆమె హామీ ఇచ్చారు. ఈ పోటీలు రాష్ట్రంలో యువ ప్రతిభకు వేదికగా నిలవనున్నాయని నిర్వాహకులు అభిప్రాయపడ్డారు. విజేతలుగా నిలిచే జట్లు జాతీయ స్థాయిలో రాష్ట్రాన్ని ప్రాతినిధ్యం వహించనున్నాయి.

# ఉపాధ్యాయురాలు జ్యోత్స్నభాయ్ మృతి పట్ల సంతాపం

**తుని, వేద న్యూస్**

రాజానగరం పాఠశాల ఉపాధ్యాయురాలు జ్యోత్స్నభాయ్ ఆకస్మిక మరణం పాలిట కావడం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తమవుతోంది. ఈ సంఘటన ప్రాంతీయ విద్యా వర్గాలను, స్థానిక ప్రజలను తీవ్రంగా కలిచివేసింది. రెండేళ్ల క్రితం భర్తను కోల్పోయిన కుటుంబానికి ఇది మరొక పెద్ద దెబ్బగా మారింది. తునిలో జరిగిన చివరి దర్శన కార్యక్రమానికి మంత్రి అనిత వంగలపూడి హాజరై పుష్పాంజలి ఘటించారు. ఆమె కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పి, ప్రభుత్వం సంపూర్ణ సహాయాన్ని అందిస్తుందని తెలిపారు. జ్యోత్స్నభాయ్ మృతి పట్ల వ్యక్తిగతంగా బాధపడ్డానని ఆమె పేర్కొన్నారు. కుటుంబంలో చదువుతున్న ఇద్దరు చిన్నారుల భవిష్యత్తు గురించి మంత్రి హామీ ఇచ్చారు. పిల్లల విద్యాభాధ్యతను ప్రభుత్వం భుజస్కందం చేస్తుందని తెలిపారు. వారి భవిష్యత్తు దిశగా ఏ లోటు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటామని కుటుంబానికి భరోసా ఇచ్చారు. ఈ ఘటనపై విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కూడా స్పందించి, సంబంధిత అధికారులు ఆ కుటుంబానికి అలాంటి పరిస్థితుల్లో అవసరమైన ఎ తక్షణ సాయం, పాఠశాల విద్యకు సంబంధించిన అవసరాల్ని ప్రభుత్వం చూసుకుంటుందని తెలియజేశారు.



# గంభీర్‌కు అండగా బీసీసీఐ




**వేద న్యూస్ డెస్క్:**

కోల్‌కతా మైదానంలో సౌతాఫ్రికాతో జరిగిన తొలి టెస్ట్‌లో భారత్ అనూహ్యంగా ఓటమి చవిచూసిన తర్వాత, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ పై విమర్శల వెల్లువ ఊపందుకుంది. వరుస పరాజయాలకు గంభీర్ బాధ్యత వహించాలన్న అభ్యర్థనలు సోషల్‌మీడియాలో పెరుగుతుండగా అతడిని కోచ్ పదవి నుంచి తప్పించాలన్న హ్యాష్ ట్యాగ్‌లు కూడా ట్రెండ్ అవుతున్నాయి. జట్టు ప్రదర్శనపై అసంతృప్తిగల అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నా ఈ పరిస్థితుల్లో బీసీసీఐ గంభీర్‌కు గట్టి అండగా నిలిచి స్పష్టం చేసిన మాటలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి.ఈ ఆరోపణ లు, విమర్శలన్నింటిని పక్కనపెడుతూ బోర్డు కోచ్ బృందం సామర్థ్యంపై తన విశ్వాసాన్ని మరొక్కసారి వెల్లడించింది. బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా మాట్లాడుతూ“ఒక ఓటమి వచ్చింది కాబట్టి వెంటనే కోచ్‌ను తప్పించాలనే భావన తగదు. మా సెలక్టర్లు, కోచింగ్ బృందం, హెడ్ కోచ్, ఆటగాళ్లపై పూర్తి నమ్మకం ఉంది. సోషల్‌మీడియా విమర్శలు మాకు బాగా తెలుసు అయితే వాటిని మేము అంతగా పట్టించుకోము. ఇదే జట్టు ఇటీవల ఛాంపియన్స్ ట్రోఫీని గెలిచింది, ఆసియా కప్‌లో మెరిసింది, ఇంగ్లాండ్ నేలపై సిరీస్‌ను సమం చేసింది. ఒక పరాజయంతో జట్టుని తప్పుపట్టడం హైప్ మాత్రమే” అని వ్యాఖ్యానించారు. వివిధ టోర్నీల్లో విశ్వాసాన్ని నింపే ప్రదర్శన ఇచ్చిన ఈ జట్టులో ఉన్న సామర్థ్యం బోర్డు దృష్టికి అందని విషయం కాదని సైకియా స్పష్టం చేశారు. ఆటగాళ్లతో పాటు కోచింగ్ సిబ్బంది కృషిని బీసీసీఐ మెచ్చుకుంటోందని చెప్పారు. ప్రస్తుత సిరీస్‌లో ఎదురైన వైఫల్యం జట్టుకు తాత్కాలికం మాత్రమేనని, గంభీర్ నాయకత్వంలో జట్టు త్వరలోనే కోలుకుంటుందన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. ఓటమి నేపథ్యంలో వచ్చిన విమర్శలను త్రోసిపుచ్చుతూ గంభీర్‌కు బీసీసీఐ ఇస్తున్న ఈ మద్దతు జట్టుకు అవసరమైన ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా ఉంది. భారత క్రికెట్ చరిత్రలో బోర్డు ఎప్పుడు ఏ విషయంలోనైనా కోచ్‌కు అండగా నిలిచిందని, ఈసారి కూడా అదే ధోరణి కొనసాగుతోందని క్రికెట్ వర్గాలు భావిస్తున్నాయి. భారత క్రికెట్ నియంత్రణ మండలి 1928 డిసెంబర్ 4న స్థాపించబడిందన్న విషయాన్ని బోర్డు మరోసారి గుర్తు చేస్తూ జట్టు నిర్మాణం, శిక్షణ వ్యవస్థ, ఆటగాళ్ల అభివృద్ధి వంటి అంశాల్లో బోర్డు ఎల్లప్పుడూ కోచ్ బృందానికి మద్దతుగా ఉంటుందని తెలిపింది. ఒక ఓటమితో గంభీర్‌పై ఒత్తిడి పెరగొచ్చేమోగానీ అతడి వెనుక బీసీసీఐ నిలబడటం ప్రస్తుతం జట్టుకు అత్యంత కీలకమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# ‘వారణాసి’లో భారీ సర్‌ప్రైజ్..

- రాజమౌళి-మహేశ్ సినిమాలో 6 పాటలు
- మ్యూజిక్ డైరెక్టర్ ఎం.ఎం.కీరవాణి వెల్లడి



**వేద న్యూస్, డెస్క్:**

సూపర్ స్టార్ మహేశ్ బాబు, దర్శక ధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ చిత్రం ‘వారణాసి’పై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే రామోజీ ఫిల్మ్ సిటీలో ఇటీవల జరిగిన గ్లోబ్ ట్రాటర్ ఈవెంట్‌లో విడుదల చేసిన నాలుగు నిమిషాల గ్లింప్స్ సోషల్ మీడియాలో రికార్డు స్థాయిలో వ్యూస్ సాధించారు. పురాణ గాథలు, సైన్స్ ఫిక్షన్ అంశాలను కలగలిపి రూపొందిస్తున్న ఈ విజువల్ వండర్ ప్రేక్షకులను ఒక కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్తుందని సినీ విశ్లేషకులు చెబుతున్నారు.ఈ సందర్భంగా దర్శకుడు రాజమౌళి మాట్లాడుతూ, మహాభారతం తన కలల ప్రాజెక్ట్ అని, అయితే ‘వారణాసి’ ద్వారా రామాయణానికి సంబంధించిన గొప్ప ఘట్టాన్ని ముందుగా తెరకెక్కించాల్సి వచ్చిందని వివరించారు. శ్రీరాముడి లుక్‌లో మహేశ్ బాబు తొలిసారి సెట్‌లోకి అడుగుపెట్టినప్పుడు తనకు వచ్చిన ఫీలింగ్‌ని మాటల్లో చెప్పలేనని ఆయన అన్నారు. ఆ లుక్ ఫోటోను కొంతకాలం తన మొబైల్ వాల్‌పేపర్‌గా కూడా పెట్టుకున్నానని, కానీ అది బయటకు లీక్ అవుతుందేమోనని భయపడి తొలగించేశానని సరదాగా తెలిపారు.ఈ సినిమాలో హనుమంతుడి పాత్రను ప్రముఖ నటుడు ఆర్. మాధవన్ పోషిస్తున్నాడనే వార్తలు ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. తొలివేళల్లో మహేశ్ బాబు తండ్రి పాత్రలో మాధవన్ కనిపిస్తాడని టాక్ వచ్చినా, ఇప్పుడు హనుమంతుడిగా కనిపిస్తాడన్న ప్రచారం ఊపందుకుంది. ఈ విషయంపై చిత్ర బృందం నుంచి ఇంకా అధికారిక స్పందన రావాల్సి ఉంది.ఇదిలా ఉండగా, సంగీత దర్శకుడు కీరవాణి తాజాగా ఈ సినిమాపై ఓ కీలక అప్‌డేట్ ఇచ్చారు. గోవాలో నిర్వహించిన అంతర్జాతీయ ఫిలిం ఫెస్టివల్ వేదికగా మాట్లాడిన ఆయన, ‘వారణాసి’ చిత్రంలో మొత్తం ఆరు పాటలు ఉంటాయని ప్రకటించారు. ఈ పాటలు కథానుగుణంగా ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉంటాయని, ఏ పాట కూడా ఫీల్ చేయడానికోసం పెట్టినదిగా ఉండదని చెప్పారు. సంగీతం ప్రేక్షకులను భావోద్వేగంగా, ఆధ్యాత్మికంగా ఒక కొత్త అనుభూతికి తీసుకెళ్తుందని కీరవాణి తెలిపారు.ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన ‘సంచారి’, ‘రణ కుంభ’ పాటలు మ్యూజిక్ లవర్స్‌ని బాగా ఆకట్టుకున్నాయి. ఈ యాక్షన్ అడ్వెంచర్ చిత్రం 2027 వేసవిలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇందులో మహేశ్ బాబు ‘రుద్ర’ అనే శక్తిమంతమైన పాత్రలో కనిపించనుండగా, బాలీవుడ్ నటి ప్రియాంక చోప్రా ‘మందాకిని’గా నటిస్తున్నారు. ప్రధాన ప్రతినాయకుడిగా మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ ‘కుంభ’ పాత్రలో కనిపించనున్నారు

# ‘అమృతం’ వచ్చేస్తోంది..

## – మళ్లీ ప్రేక్షకుల ముందుకు..




**వేద న్యూస్, డెస్క్:**

తెలుగు ప్రేక్షకులను రెండు దశాబ్దాల పాటు అలరించిన అతి ప్రియమైన హాస్య ధారావాహిక ‘అమృతం’ మళ్లీ ప్రేక్షకులను పలుకరించేందుకు సిద్ధమైంది. బుల్లితెరపై సంచలనం సృష్టించిన ఈ కుటుంబ హాస్య సీరియల్‌ను ఇప్పుడు కొత్త రూపంలో, మరింత శుభ్రంగా, స్పష్టమైన చిత్ర గుణాత్మకతతో యూట్యూబ్ వేదికగా అందుబాటులోకి తీసుకురాబోతున్నారు నిర్వాహకులు. ఇటీవలే ఈ సిట్‌కామ్ తన ప్రయాణంలో 24 ఏండ్లు పూర్తి చేసుకున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ధారావాహిక నిర్వాహకులు ప్రత్యేక నిర్ణయం తీసుకున్నారు. నవంబర్ 24 నుంచి ప్రతి రోజు రెండు ఎపిసోడ్‌లు యూట్యూబ్‌లో ‘అమృతం అనే ప్రత్యేక ఛానల్ ద్వారా రీమాస్టర్‌డ్ రూపంలో విడుదలవనున్నాయి. పాత స్మృతుల్ని జ్ఞాపకం చేస్తూ, కొత్త తరానికి కూడా నవ్వుల పండుగను అందించేందుకు సిద్ధమవుతోంది ఈ సీరియల్. 2001 నవంబర్ 18న జెమిని టీవీ ద్వారా ప్రారంభమైన ‘అమృతం’, ఆరు సంవత్సరాల పాటు, అంటే 2007 నవంబర్ 18 వరకు విజయవంతంగా ప్రసారమైంది. మొత్తం 313 ఎపిసోడ్‌లు ప్రజలను కడుపుబ్బ నవ్వించిన ఈ సిట్‌కామ్‌కు తెలుగు టీవీ చరిత్రలో ప్రత్యేక స్థానం ఉంది. ప్రముఖ రచయిత, నిర్మాత గుణ్ణం గంగరాజు ఈ ధారావాహికను సృష్టించి నిర్మించారు. అమృతం పాత్రలో కాలక్రమానుసారం శివాజీ రాజా, నరేష్, హర్షవర్ధన్ నటించారు. అంజి పాత్రలో గుండు హనుమంతురావు తనదైన శైలిలో ప్రేక్షకులను నవ్వించగా, సర్వం పాత్రలో వాసు ఇంటూరి, అప్పాజీ పాత్రలో శివన్నారాయణ నరిపెద్ది చిరస్మరణీయ నటనతో ప్రేక్షక హృదయాల్లో నిలిచిపోయారు. మళ్లీ విడుదలవుతున్న ఈ రీమాస్టర్‌డ్ ఎపిసో డ్‌ల కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. యూట్యూబ్ వేదికగా ‘అమృతం’ మరోసారి తెలుగు గృహాల్లో నవ్వుల సందడి రాబోతుం దనే నమ్మకమే ఉంది.

# సమంత.. బీస్ట్ మోడ్



**వేద న్యూస్, డెస్క్:**

టాలీవుడ్ స్టార్ నటి సమంత రూత్ ప్రభు మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ప్రస్తుతం ‘మా ఇంటి బంగారం’ సినిమా షూటింగ్‌తో బిజీగా ఉన్న ఆమె జిమ్‌లో తన వర్కౌట్ సెషన్స్‌కి సంబంధించిన ఫోటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేయడంతో అవి నెట్టింట్లో వైరల్ అయ్యాయి. ఆ ఫోటోలో బ్యాక్, ఆర్మ్స్ మసిల్స్‌ను ఫ్లెక్స్ చేస్తూ కనిపించిన సమంత ఫిట్‌నెస్ ట్రాన్స్‌ఫార్మేషన్ అభిమానులను ఆకట్టుకుంటోంది. గ్రే స్పోర్ట్స్ బ్రా, నేవీ లెగింగ్స్, వైట్ స్నీకర్స్‌లో ఆమె అథ్లెటిక్ లుక్‌కి సోషల్ మీడియాలో విపరీతమైన స్పందన లభిస్తోంది.

# ‘బాయిలోనే బల్లి పలికే’..

## – మంగ్లీ కొత్త పాటకు ప్రేక్షకుల నుంచి జోష్ రెస్పాన్స్





**వేద న్యూస్, డెస్క్:**

తెలంగాణ జానపద గానానికి తనదైన శైలి, ప్రత్యేకమైన స్వరంతో కొత్త ఊపును తీసుకొచ్చిన గాయని మంగ్లీ మరోసారి యూట్యూబ్‌లో దుమ్మురేపుతోంది. ఫోక్ పాటలు ఎప్పుడూ నేటి యువతతో పాటు పెద్దలకు కూడా సమానంగా కనెక్ట్ కావడం తెలిసిందే. ఇప్పుడు ఆమె తాజా గీతం ‘బాయిలోనే బల్లి పలికే’ విడుదలైన క్షణాల్లోనే వైరల్ అవుతూ మరోసారి మంగ్లీ ఫ్యాన్‌బేస్ ఎంత విస్తారంగా ఉందో నిరూపిస్తోంది.ఈ పాట యూట్యూబ్‌లో విడుదలైన వెంటనే ట్రెండింగ్‌లోకి ఎగబాకింది. దీనికి ముఖ్య కారణం మంగ్లీతో కలిసి ప్రముఖ జానపద గాయని నాగవ్వ గళం కలపడం. ఇద్దరి గొంతులు కలిసినప్పుడు వచ్చే ఆ పల్లెటూరి శోభ, ఆ నిజమైన ఫోక్ వైబ్స్ శ్రోతలకు కొత్త ఉత్సాహాన్ని ఇస్తున్నాయి. గ్రామీణ జీవితంలోని సహజ శబ్దాలు, మాటల తీరులు, పాటలోని ఉత్సాహభరితమైన రిథమ్ ౦ ఇవన్నీ కలిసి ఈ సాంగ్‌ను ప్రేక్షకులను వెంటనే ఆకట్టుకునేలా చేస్తున్నాయి.ఈ పాటకు కమల్ ఎస్లావత్ సాహిత్యం అందించగా, సంగీతం సురేష్ బొబ్బిలి సమకూర్చారు. బొబ్బిలి సంతకమైన ఫోక్-ఫ్యూజన్ టచ్ ఈ సాంగ్‌లో స్పష్టంగా వినిపిస్తోంది. సాంప్రదాయ బీట్‌లు, ఆధునిక ధ్వనులను సమపాళ్లలో కలిపిన ఆయన ట్యూనింగ్ పాటను మరింత ఆకర్షణీయంగా మార్చింది.వీడియో సాంగ్‌ను దాము రెడ్డి దర్శకత్వం వహించారు. గ్రామీణ పరిసరాల్లో చిత్రీకరణ చేసిన ఈ వీడియోలో రంగుల హోరు, డ్యాన్స్ షాట్లు, పల్లె జీవనానికి దగ్గరైన విజువల్స్ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. మంగ్లీ, నాగవ్వతో పాటు స్థానిక కళాకారుల పాల్గొనడం పాటకు మరింత నేటివిటీ జోడించింది.ప్రస్తుతం ఈ పాట సోషల్ మీడియాలో అన్ని వేదికలపై షేర్ అవుతూ భారీగా వ్యూస్ సొంతం చేసుకుంటోంది. యూట్యూబ్ కామెంట్స్‌లో ప్రేక్షకులు మంగ్లీ, నాగవ్వల జోడీకి ప్రశంసలు కురిపిస్తున్నారు. మంగ్లీ ప్రతి సారి ఇచ్చే ఫోక్ ట్రీట్ ఎలా ఉంటుందో తెలిసిన అభిమానులు ఈసారి మరింత ఎంజాయ్ చేస్తున్నట్లు కనిపిస్తోంది.ఈ క్రమంలో ‘బాయిలోనే బల్లి పలికే’ ఈ వారం వైరల్ ఫోక్ సాంగ్‌గా నిలిచే అవకాశాలు బలంగా కనిపిస్తున్నాయి.

# మంచు మనోజ్ కొత్త అడుగు

## – రాగ మ్యూజిక్’తో సంగీత ప్రస్థానం ప్రారంభం





**వేద న్యూస్, డెస్క్:**

టాలీవుడ్ నటుడు మంచు మనోజ్ తన సినీ ప్రయాణానికి విరామం ఇచ్చి, కొత్తగా సంగీత ప్రపంచంలో అడుగు పెట్టారు. చాలా ఏళ్లుగా తన హృదయంలో దాచుకున్న స్వప్నం నేడు నిజమైంది. శనివారం ఆయన కొత్త మ్యూజిక్ లేబుల్ ‘మోహన రాగ మ్యూజిక్’ అధికారికంగా ప్రారంభమైంది. సంగీతం తనకు ఎప్పుడూ ఓ ఆశ్రయం, ఓ భావప్రకటన అని మనోజ్ భావోద్వేగంగా గుర్తుచేసుకున్నారు. మనోజ్ తెలిపిన వివరాల ప్రకారం..ఈ మ్యూజిక్ లేబుల్ కొత్త తరానికి వేదికగా, ధైర్యంగా ఆలోచించే సంగీత యువతకు అవకాశాలను అందించేందుకు రూపొందించబడింది. “లోకల్ హార్ట్స్, గ్లోబల్ బీట్” అన్న నినాదంతో ఈ సంస్థను ముందుకు తీసుకెళ్లనున్నట్టు ఆయన చెప్పారు. సంగీతంపై మనోజ్‌కున్న ప్రేమ కొత్తది కాదు. ‘పోటుగాడు’లో “ప్యార్ మే పడిపోయా” పాటను స్వయంగా పాడిన మనోజ్, కరోనా సమయంలో విడుదల చేసిన “అంతా బాగుంటాంద్రా” పాటతో మంచి పేరు తెచ్చుకున్నాడు. అలాగే పిస్తా పిస్తా, ఎన్నో ఎన్నో, ప్రాణం పోయే బాధ వంటి పాటలకు సాహిత్యం కూడా రాశారు. తండ్రి మంచు మోహన్ బాబు, అన్న విష్ణు, అక్క లక్ష్మీ మంచుఈ కుటుంబానికి సంగీతం, సినిమా పట్ల ఉన్న అనుబంధమే ‘మోహన రాగ’ అనే పేరుకి ప్రేరణగా ఉందని ఆయన పేర్కొన్నారు. హాలీవుడ్ చిత్రం కోసం అచ్చు రాజమణితో కలిసి పనిచేసిన అనుభవం తన సంగీత ప్రయాణంలో ప్రత్యేకమైనదన్నాడు. అంతర్జాతీయ స్థాయిలో కొత్త ప్రాజెక్టులు రూపొందుతున్నాయని, వాటిని త్వరలో ప్రకటించనున్నట్టు” మనోజ్ తెలిపారు. తెలుగు సంగీతాన్ని ప్రపంచానికి మరింత దగ్గర చేయడం తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. సినిమా తార నుంచి సంగీత సృష్టికర్తగా మారిన మనోజ్ కొత్త మ్యూజిక్ ప్రయాణం అభిమానుల్లో ఆసక్తిని రేపుతోంది.

# ప్రియాంకతో స్టెప్పులు

## – మహేశ్‌తో ప్రశంసలు.. బర్త్ డే బాయ్ కార్తికేయ



**వేద న్యూస్, డెస్క్:**

దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి తనయుడు, యువ నిర్మాత ఎస్.ఎస్. కార్తికేయ శనివారం తన 34వ పుట్టినరోజుని జరుపుకుంటున్నారు. సినీ పరిశ్రమలోని అనేకమంది ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతుండగా, ముఖ్యంగా ‘వారణాసి’ చిత్ర బృందం పంపిన సందేశాలు ప్రత్యేకంగా నిలిచాయి. అందులో సూపర్‌స్టార్ మహేశ్‌బాబు, గ్లోబల్ ఐకాన్ ప్రియాంక చోప్రా వ్యాఖ్యలు సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తున్నాయి. సూపర్ స్టార్ మహేశ్‌బాబు, కార్తికేయ పుట్టినరోజును పురస్కరించుకుని పంపిన సందేశంలో..“మేం నిర్మించే ప్రతి పనికి వెనక నిలిచే నిశ్శబ్ద శక్తి నువ్వే. కఠినమైన పనుల్నీ సులభంగా, శాంతంగా పూర్తి చేసే నీ తీరు ఎప్పుడూ ఆశ్చర్యమే. ఈ కొత్త సంవత్సరం నీకు మరి ంత విజయాలు తీసుకురావాలి,” అని ప్రేమగా రాశారు.“తేలికగా తీసుకో నా మిత్రమా! ప్రతి గొప్ప పనికి వెనక నిలబడే నిశ్శబ్ద వ్యక్తికి జన్మదిన శుభాకాంక్షలు. ‘వారణాసి’ ప్రయాణంలో నీ తో కలిసి డాన్స్ చేయడం చాలా ప్రత్యేక అనుభవం,” అంటూ ప్రియాంక రాసుకొచ్చింది.